WANTED
బహుజన వేదిక
తెలుగు జాతీయ దినపత్రికలో పనిచేయుటకు
ఆంధ్ర ప్రదేశ్ మరియు తెలంగాణ రాష్ట్రాలలోని
అన్ని జిల్లాలకు మరియు నియోజకవర్గ మండల కేంద్రాలకు
జిల్లా ఇంఛార్జిలు, స్టాఫ్ రిపోర్టర్లు, విలేకరులు కావలెను.
ఆయా జిల్లాల్లోని మరియు ప్రాంతాలలో రాజకీయాలు,
ఇతర అంశాలపై లోతైన విశ్లేషణలు వ్రాయగల సామర్థ్యం ఉండాలి,
అనుభవం ఉన్నవారికి ప్రాధాన్యత ఇవ్వబడును
వెంటనే సంప్రదించండి
9849805056 | 9494900294

RNI Reg NO: APTEL/2024/ 86898

# బహుజన వేదిక

తెలుగు జాతీయ దినపత్రిక

చదవండి ! చదివించండి !! చందాదారులు కండి !!!
వేదిక చందా వివరాలు
సంవత్సర చందా : రూ. 1800/-
అర్థ సంవత్సర చందా : రూ. 900/-
ఒక నెల చందా : రూ. 150/-
విడి పత్రిక : రూ. 5/-
వివరాల కొరకు :
9849805056, 9494900294

ANANTHAPURAM I KURNOOL I KADAPA I AMARAVATHI HYDERABAD I VIJAYAWADA I VISHAKAPATNAM I GUNTUR I PRAKASAM I RAJAMANDRI I TADEPALLIGUDEM I KHAMMAM I KARIMNAGAR I I NALGONDA I

సంపుటి : 2 సంచిక : 238 బుధవారం 15 ఏప్రిల్ 2026 ఎడిటర్ : పి రామాంజనేయ ప్రసాద్ వెల : 5/- పేజీలు : 8 Email : bahujanavedikaap@gmail.com

## 45 లక్షల మందికి క్వాంటం..

# ఏఐ నైపుణ్యాల్లో శిక్షణ

- దేశంలో తొలి క్వాంటం రిఫరెన్స్ ఫెసిలిటీల ఆవిష్కరణ
- 1 ఎస్,1క్యూ క్వాంటం టెస్ట్‌బెడ్‌లను జాతికి అంకితం చేసిన సీఎం చంద్రబాబు
- క్వాంటం టెక్నాలజీకి అమరావతిని లాంచ్ పాడ్‌గా మారుస్తాం
- ఎస్ఆర్ఎం యూనివర్సిటీలో 1ఎస్ ఓపెన్ యాక్సెస్ క్వాంటం ఫెసిలిటీ, మేథాటవర్స్‌లో 1 క్యూ పేరిట మరో క్వాంటం సిస్టం ఏర్పాటు



**అమరావతి**

ప్రపంచ క్వాంటం దినోత్సవాన్ని పురస్కరించుకుని ఆంధ్రప్రదేశ్‌లో ఓ సరికొత్త టెక్ అధ్యాయం ప్రారంభమైంది. దేశంలోనే తొలి క్వాంటం రిఫరెన్స్ ఫెసిలిటీ ఆవిష్కృతమైంది. అమరావతిలోని ఎస్ఆర్ఎం యూనివర్సిటీ, గన్నవరంలోని మేధా టవర్స్ వద్ద ఏర్పాటు చేసిన 1 ఎస్, 1 క్యూ క్వాంటం రిఫరెన్స్ ఫెసిలిటీలను ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు జాతికి అంకితం చేశారు. క్వాంటం టెక్నాలజీకి అమరావతిని లాంచ్ పాడ్‌గా మారుస్తామని ముఖ్యమంత్రి ఈ సందర్భంగా స్పష్టం చేశారు. క్వాంటం రిఫరెన్స్ ఫెసిలిటీలను ప్రారంభించిన అనంతరం క్వాంటం రంగ నిపుణులు, శాస్త్రవేత్తలు, పరిశోధకులు, విద్యార్థులను ఉద్దేశించి ముఖ్యమంత్రి ప్రసంగించారు. ముఖ్యమంత్రి చంద్రబాబు - మిగతా3లో



# ఈ ఏడాది వర్షాలు తక్కువే!

- నైరుతి రుతుపవనాలపై ఎల్‌నినో ప్రతికూల ప్రభావం
- ఈ ఏడాది సాధారణం కంటే తక్కువగా వర్షాలు పడుతాయని ఐఎండీ అంచనా
- సాధారణ సగటులో 92 శాతం వర్షపాతం నమోదుకావచ్చని వెల్లడి
- ఎల్‌నినో వల్ల వర్షాలపై ప్రతికూల ప్రభావం ఉంటుందని అంచనా

**అమరావతి**

దేశవ్యాప్తంగా ఈ ఏడాది నైరుతి రుతుపవనాల వర్షపాతం జూన్ నుంచి సెప్టెంబర్ వరకు సాధారణం కంటే తక్కువగా నమోదయ్యే అవకాశం ఉందని భారత వాతావరణ శాఖ అంచనా వేసింది. దీర్ఘకాలిక వర్షపాత అంచనాల ప్రకారం ఈ సీజన్‌లో వర్షపాతం సాధారణ సగటులో 92 శాతంగా ఉండవచ్చని పేర్కొంది. దీనికి అదనంగా లోటుగా 5 శాతం మార్పు ఉండవచ్చని తెలిపింది. ఐఎండీ అంచనాల ప్రకారం వర్షపాత - మిగతా3లో



# బిహార్ కొత్త ముఖ్యమంత్రిగా సమ్రాట్ చౌధరీ

- బీజేపీ తొలి సీఎంగా రికార్డ్
- బిహార్‌లో బీజేపీ శాసనసభా పక్ష నేతగా ఎంపికైన సమ్రాట్ చౌధరీ
- నూతన ముఖ్యమంత్రిగా బాధ్యతలు
- బుధవారం లోక్‌భవన్‌లో సీఎంగా బాధ్యతలు చేపట్టనున్నట్లుగా సమాచారం.



# ఛత్తీస్‌గఢ్ పవర్‌ప్లాంట్‌లో బాయిలర్ పేలుడు..

- 10 మంది మృతి.. 40 మందికి గాయాలు
- ప్రమాద స్థలంలో శిథిలాల కింద మరికొందరు కార్మికులు చిక్కుకుని ఉన్నట్లు అనుమానం
- ఈ ఘటనపై దిగ్భ్రాంతి వ్యక్తం చేసిన ఛత్తీస్‌గఢ్ సీఎం విష్ణుదేవ్ సాయ్

## రాజ్యాంగాన్ని బీజేపీ, ఆరెస్సెస్

# ఆలోచనలు ధ్వంసం చేస్తున్నాయి

- కాషాయ పార్టీ ఓట్ల దొంగతనానికి పాల్పడుతోంది
- బీజేపీ ప్రజాస్వామ్యాన్ని నాశనం చేస్తోంది
- బంగాల్‌లో బీజేపీ ఓటు చోరీ చేసేందుకు మమతా ప్రభుత్వమే అవకాశం ఇచ్చింది
- రాహుల్ గాంధీ ఆరోపణలు





## కుంభమేళా తరహాలో

# గోదావరి పుష్కరాలు

**దిశానిర్దేశం చేసిన డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్**

**వివరాలు వెల్లడించిన పర్యాటక శాఖ మంత్రి కందుల దుర్గేష్**

**అమరావతి**

2027లో వచ్చే గోదావరి పుష్కరాలను అత్యంత ప్రతిష్టాత్మకంగా నిర్వహించాలని డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ దిశానిర్దేశం చేశారు. త్వరలోనే రాజమహేంద్రవరంలో కూటమి నాయకులతో గోదావరి పుష్కరాలపై సమీక్షా సమావేశం నిర్వహిస్తామని డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ తెలిపారని మంత్రి దుర్గేష్ వెల్లడించారు. నిడదవోలు నియోజకవర్గంలో పంచాయతీరాజ్, గ్రామీణాభివద్ధి శాఖ ద్వారా జరుగుతున్న అభివద్ధి పనుల వివరాలను ఆరా తీసిన డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్.. వివరాలను మంత్రి దుర్గేష్ వెల్లడించారు. మంగళగిరిలోని ఉప ముఖ్యమంత్రి క్యాంపు కార్యాలయంలో డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ వివిధ అంశాలపై చర్చించారని, - మిగతా3లో



# 850కి లోక్‌సభ స్థానాలు

- డీలిమిటేషన్ కమిషన్ ఏర్పాటు
- మహిళా రిజర్వేషన్ల అమలుకు కేంద్రం సిద్ధం
- దేశంలోని చట్టసభల్లో మహిళలకు 33 శాతం రిజర్వేషన్లు
- 2011 జనాభా లెక్కల ప్రకారమే లోక్‌సభ సీట్ల పెంచాలని బిల్లులో ప్రతిపాదించిన కేంద్రం
- ఈనెల 16న లోక్‌సభలో ప్రవేశపెట్టనున్న కేంద్రం


# రారెత్తిస్తున్న ఎండలు, వడగాడ్పులు



- నేడు 42-44 డిగ్రీల ఉష్ణోగ్రత నమోదయ్యే అవకాశం
- రాష్ట్రంలో మరింత ప్రభావం చూపనున్న ఎండలు, వడగాడ్పులు
- నేడు కోస్తా, రాయలసీమలో 42-44 డిగ్రీల ఉష్ణోగ్రత నమోదయ్యే అవకాశం
- ఎండ తీవ్రత, ఉక్కపోతపై ప్రజలు తగిన జాగ్రత్తలు తీసుకోవాలన్న అధికారులు

**అమరావతి**

రాష్ట్రంలో వేసవి కాలం మొదలు కావడంతో రోజురోజుకీ ఎండలు, వడగాడ్పులు పెరిగిపోతున్నాయి. ఉదయం 10 గంటలు దాటిందంటే చాలు ప్రజల ఇళ్ల నుంచి బయటకు వచ్చేందుకు హడలిపోతున్నారు. ఎండ తీవ్రత, వడగాల్పులు, ఉక్కపోత పట్ల ప్రజలు తగిన జాగ్రత్తలు తీసుకోవాలని అధికారులు సూచిస్తున్నారు. ఈ క్రమంలో రాష్ట్రంలో ఎండ తీవ్రత మరింత ప్రభావం చూపనుందని రాష్ట్ర విపత్తుల నిర్వహణ సంస్థ అంచనా వేసింది. కడప జిల్లాలోని ఒంటిమిట్టలో ఈ రోజు - మిగతా3లో



# ఆర్టికల్ 370 రద్దు తర్వాత పూర్తిగా అమల్లోకి రాజ్యాంగం

- డెహ్రాడూన్ పర్యటనలో ప్రధాని మోదీ
- దిల్లీ, డెహ్రాడూన్ ఎకనామిక్ కారిడార్ ప్రారంభం
- చట్టసభల్లో మహిళలకు 33 శాతం రిజర్వేషన్లు అమల్లో జాప్యం జరగడానికి వీల్లేదు
- ఉమ్మడి పౌరస్మృతిని అమలు చేసిన తొలి రాష్ట్రంగా ఉత్తరాఖండ్ నిలించింది
- హరిద్వార్‌లో జరగనున్న కుంభమేళా సందర్భంగా ఉత్తరాఖండ్‌ను శుభ్రంగా ఉంచాలని పిలుపు

## నారీ శక్తి వందన్ బిల్లుకు అందరూ

# మద్దతివ్వాలి

- రాజకీయ పార్టీల సీఎం లేఖ
- నారీ శక్తి వందన్ అధినియం మహిళా సాధికారతకు, దేశ ఉన్నతికి దోహదపడుతుందన్న చంద్రబాబు
- ప్రభుత్వం, పరిపాలన, చట్టసభల్లో మహిళల భాగస్వామ్యం పెరగాలి
- మహిళా రిజర్వేషన్లపై అంతా ఒకే స్వరం వినిపించాలి



**అమరావతి**

మహిళా శక్తికి చట్టబద్ధ గౌరవం కోసం ముఖ్యమంత్రి చంద్రబాబు తన వంతు చొరవ తీసుకున్నారు. 'నారీ శక్తి వందన్ అధినియం' బిల్లుకు దేశవ్యాప్తంగా ఏకగ్రీవ మద్దతు కూడగట్టాలని రాష్ట్రంలోని అన్ని పార్టీలకు లేఖలు రాశారు. ప్రభుత్వం, పరిపాలన, చట్టసభల్లో మహిళల భాగస్వామ్యం పెరిగినప్పుడే నిజమైన అభివృద్ధి సాధ్యమన్నారు. చారిత్రాత్మక ఘట్టంలో అందరూ భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు. 2029 ఎన్నికల నుంచే మహిళలకు చట్ట సభల్లో 33 శాతం రిజర్వేషన్ అమలు చేసేలా తీసుకువస్తున్న 'నారీ శక్తి వందన్' చట్ట సవరణ బిల్లుకు మద్దతు పలకాలని లేఖలో కోరారు. మహిళా రిజర్వేషన్ల బిల్లు నారీ శక్తి వందన్ అధినియంకు పార్లమెంట్‌లో మద్దతివ్వాలని రాజకీయ పార్టీల అధ్యక్షులు, రాష్ట్రంలోని రాజ్యసభ, లోక్‌సభ ఎంపీలకు సీఎం చంద్రబాబు లేఖ రాశారు. జనసేన అధ్యక్షుడు పవన్ కళ్యాణ్, బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు పీవీఎన్ మాధవ్, వైఎస్సార్సీపీ అధ్యక్షుడు వైఎస్ జగన్, ఏపీసీసీ - మిగతా3లో

# 850కి లోక్‌సభ స్థానాలు



దేశంలోని చట్టసభల్లో మహిళలకు 33 శాతం రిజర్వేషన్లు కల్పించే మూడు కీలక బిల్లులను కేంద్ర ప్రభుత్వం ఈనెల 16న లోక్‌సభలో ప్రవేశపెట్టనుంది. కేంద్ర న్యాయశాఖ మంత్రి అర్జున్‌రామ్ మేఘవాల్ 131వ రాజ్యాంగ చట్ట సవరణ బిల్లు, నియోజకవర్గాల పునర్విభజన బిల్లును లోక్‌సభలో ప్రవేశపెట్టనున్నారు. ఈ బిల్లుల ద్వారా లోక్‌సభ, రాష్ట్రాల అసెంబ్లీల సీట్ల పునర్విభజన జరగనుంది. లోక్‌సభలో ప్రస్తుతం 543 స్థానాలు ఉండగా ఆ సంఖ్యను గరిష్టంగా 850కి పెంచే అవకాశం ఉంది. ఇందులో రాష్ట్రాలకు 815 స్థానాలు, కేంద్రపాలిత ప్రాంతాలకు మరో 35 సీట్లు కేటాయించనున్నారు. తర్వాత ఈ చట్ట ప్రకారం లోక్‌సభ నియోజకవర్గాలపై డీలిమిటేషన్ కమిషన్ ఏర్పాటు చేయనుంది. సుప్రీం కోర్టు ప్రస్తుత లేదా మాజీ న్యాయమూర్తి స్థాయి వ్యక్తి ఛైర్మన్‌గా ఈ కమిషన్ ఏర్పాటు కానుంది. ప్రధాన ఎన్నికల కమిషనర్ లేదా ఆయన ప్రతినిధి, సంబంధిత రాష్ట్ర ఎన్నికల కమిషన్ ప్రతినిధి సభ్యులుగా ఉంటారు. కమిషన్‌కు సహయ, సహకారాలను అందించేందుకు ప్రతి రాష్ట్రం నుంచి 10 మందిని సభ్యులుగా తీసుకుంటారు. ఆ రాష్ట్రం నుంచి ప్రాతినిధ్యం వహించే ఐదుగురు లోక్‌సభ సభ్యులు, ఐదుగురు శాసనసభ సభ్యులను సంబంధిత సభల స్పీకర్లు నామినేట్ చేస్తారు. 2011 జనాభా లెక్కల ప్రకారమే లోక్‌సభ సీట్ల పెంచాలని బిల్లులో కేంద్రం ప్రతిపాదించింది. ఆ గణాంకాల ప్రకారమే ఎస్సీ, ఎస్టీ, మహిళా రిజర్వేషన్లు ఖరారు అవుతాయన్న కేంద్రం మహిళలకు 33 శాతం రిజర్వేషన్ల అంశాన్ని కూడా బిల్లులో చేర్చింది. లోక్‌సభ, రాష్ట్రాల శాసనసభల్లో వీలైనంత మేరకు మూడో వంతు సీట్లను మహిళలకు కేటాయించేలా కమిషన్ చర్యలు తీసుకుంటుందని కేంద్రం తెలిపింది. ఈ సీట్లలో ఎస్సీ, ఎస్టీ మహిళలకు కూడా రిజర్వేషన్లు ఉంటాయని స్పష్టం చేసింది. రొటేషన్ విధానంలోనే రిజర్వేషన్లు అమలవుతాయని పేర్కొంది. మహిళలకు రిజర్వ్ చేసిన సీట్లను ఆయా రాష్ట్రాలు లేదా కేంద్రపాలిత ప్రాంతాల్లోని నియోజకవర్గాలకు రొటేషన్ పద్ధతిలో కేటాయిస్తారని తెలిపింది. నియోజకవర్గాల పునర్విభజనలో భౌగోళిక సమగ్రత, పరిపాలనా సరిహద్దులు, రవాణా సౌకర్యాలు వంటి అంశాలను డీలిమిటేషన్ కమిషన్ పరిగణనలోకి తీసుకుంటుందని కేంద్రం వెల్లడించింది.

కేంద్రపాలిత ప్రాంతాల శాసనసభల్లో నియోజకవర్గాల పునర్విభజన, మహిళా రిజర్వేషన్ల అమలును సులభతరం చేసేందుకు ఉద్దేశించిన కేంద్రపాలిత ప్రాంతాల చట్టాల సవరణ బిల్లు-2026'ను కేంద్ర హోంమంత్రి అమిత్ షా లోక్‌సభలో ప్రవేశపెట్టనున్నారు. ఈ బిల్లు ద్వారా అసెంబ్లీలు ఉన్న ఢిల్లీ, జమ్మూకశ్మీర్, పుదుచ్చేరికి సంబంధించిన 3 చట్టాలను సవరించనున్నారు. గవర్నమెంట్ ఆఫ్ యూనియన్ టెరిటరీస్ యాక్ట్-1963, గవర్నమెంట్ ఆఫ్ నేషనల్ క్యాపిటల్ టెరిటరీ ఆఫ్ ఢిల్లీ యాక్ట్-1991, జమ్మూకాశ్మీర్ పునర్వ్యవస్థీకరణ చట్టం-2019లో సవరణలు చేయనున్నారు. ఆయా శాసనసభల్లో నియోజకవర్గాల పునర్విభజన సహా 33 శాతం మహిళా రిజర్వేషన్ల అమలే లక్ష్యంగా ఈ సవరణలు చేయనున్నారు.

# బిహార్ కొత్త ముఖ్యమంత్రిగా సమ్రాట్ చౌధరీ

బిహార్‌లో కొంతకాలంగా నెలకొన్న ఉత్కంఠకు తెరదించుతూ రాష్ట్ర కొత్త ముఖ్యమంత్రిగా సమ్రాట్ చౌధరీ పేరు ఖరారైంది. ప్రస్తుత ముఖ్యమంత్రి నీతీశ్ కుమార్ తన పదవికి రాజీనామా చేయడంతో, బీజేపీ తన బలాన్ని నిరూపించుకుంటూ రాష్ట్ర పగ్గాలను చేపట్టబోతోంది. శాసనసభాపక్ష సమావేశంలో, సమ్రాట్ చౌధరీ తమ నాయకుడిగా ఎమ్మెల్యేలు ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. బుధవారం లోక్‌భవన్‌లో ఆయన సీఎంగా బాధ్యతలు చేపట్టనున్నట్లుగా సమాచారం. దీంతో బిహార్‌లో సమ్రాట్ శకం మొదలుకానుంది.

243 అసెంబ్లీ స్థానాలున్న బిహార్‌లో ఎన్‌డీఏకు 202 మంది సభ్యుల బలం ఉండగా, అందులో 89 మంది ఎమ్మెల్యేలతో బీజేపీ అతిపెద్ద పార్టీగా కొనసాగుతోంది. నీతీశ్ కుమార్ సీఎం పదవికి రాజీనామా చేసిన నేపథ్యంలో పట్నాలోని పార్టీ ప్రధాన కార్యాలయంలో బీజేపీ శాసనసభాపక్ష సమావేశం ఏర్పాటు చేసింది. అందులో సమ్రాట్ చౌధరీ పేరును శాసనసభా పక్ష నేతగా మరో డిప్యూటీ సీఎం విజయ్ సిన్హా ప్రతిపాదించారు. దీంతో ఎమ్మెల్యేలు అందరూ సమ్రాట్ చౌధరీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. శాసనసభ పక్ష సమావేశం అనంతరం సమ్రాట్ మీడియాతో మాట్లాడుతూ, ప్రజలకు సేవ చేయడానికే బీజేపీ తనకు ఈ అవకాశం ఇచ్చిందని తెలిపారు. సుమారు 30 ఏళ్లుగా రాజకీయ కార్యకర్తగా పని చేస్తున్నారని, కానీ ఇంతకుముందు తనకు ఎలాంటి సిద్ధాంతం లేదని, 2015 నుంచే బీజేపీ కోసం పనిచేస్తున్నాని గుర్తుచేశారు. నీతీశ్ కుమార్ నుంచి ఎన్నో విషయాలు నేర్చుకున్నట్లు చెప్పారు. ప్రభుత్వం ఎలా నడపాలి, బిహార్‌లో సుపరిపాలన ఎలా నెలకొల్పాలి, ప్రజాస్వామ్యానికి ఏది మంచిదనే అన్ని చెప్పారని పేర్కొన్నారు. ప్రధాని మోదీ వికసిత భారత్ దార్శనికత, నీతీశ్ కుమార్ సుసంపన్నమైన బిహార్‌ను ముందుకు తీసుకెళ్తామని అన్నారు.

**'బిహార్ ప్రజలకు సేవ చేసేందుకు ఓ అవకాశం'**



నూతన సీఎంగా ఎన్నికైన అనంతరం సమ్రాట్ చౌధరీ ఎక్స్‌లో పోస్ట్ చేస్తూ బీజేపీ నాయకత్వానికి కృతజ్ఞతలు తెలిపారు. 'బీజేపీ నాయకుడిగా బాధ్యతను అప్పగించి, నాపై విశ్వాసం ఉంచినందుకు పార్టీ నాయకత్వానికి నా హృదయపూర్వక కృతజ్ఞతలు తెలియజేస్తున్నా. ఇది నాకు కేవలం ఒక పదవి మాత్రమే కాదు. బిహార్ ప్రజలకు సేవ చేసేందుకు, వారి నమ్మకాన్ని, కలలను సాకారం చేసేందుకు లభించిన ఒక పవిత్రమైన అవకాశం. సంపూర్ణ అంకితభావం, నిబద్ధత చిత్తశుద్ధితో ప్రతి ఒక్కరి అంచనాలకు అనుగుణంగా నడుచుకుంటానని నేను ప్రతిజ్ఞ చేస్తున్నా. ప్రధాని మోదీ, నాయకత్వంలోనూ, పార్టీ జాతీయ అధ్యక్షుడు నితిన్ నబీన్ గారి మార్గదర్శకత్వంలోనూ బిహార్‌ను అభివృద్ధి, సుపరిపాలన సంపన్నతలో కొత్త శిఖరాలకు చేర్చడానికి నేను నిరంతరం కట్టుబడి ఉంటాను. మీ ఆప్యాయత, ఆశీస్సులు, సహకారమే నా అత్యంత గొప్ప బలం' అని సమ్రాట్ చౌధరీ పోస్ట్‌లో రాసుకొచ్చారు.

**సమ్రాట్ రాజకీయ ప్రస్థానం**

బిహార్ రాజకీయాల్లో అత్యంత కీలక నేతగా ఎదిగిన నాయకుడు సమ్రాట్ చౌధరీ. కుష్వాహా సామాజికవర్గానికి చెందిన బలమైన నాయకుడిగా, బీజేపీకి ఓబీసీ ముఖచిత్రంగా ఆయన గుర్తింపు పొందారు. ఆయన తండ్రి శకుని చౌధరీ ఏడుసార్లు ఎమ్మెల్యే, ఎంపీగా పని చేశారు. తల్లి పార్వతీ దేవి తారాపూర్ నుంచి ఎమ్మెల్యేగా పనిచేశారు. 57 సంవత్సరాల సమ్రాట్ చౌధరీ సామాన్య కార్యకర్త నుంచి రాష్ట్ర ముఖ్యమంత్రి స్థాయికి ఎదిగిన తీరు ఆసక్తికరంగా ఉంటుంది. రెండుసార్లు ఎమ్మెల్సీగా గెలిచిన సమ్రాట్ చౌధరీ, అసెంబ్లీ ఎన్నికలకు మొత్తం ఐదు సార్లు పోటీ చేయగా మూడు సార్లు విజయం సాధించారు. ప్రస్తుతం తారాపూర్ నియోజకవర్గానికి బీజేపీ ఎమ్మెల్యేగా ప్రాతనిధ్యం వహిస్తున్నారు.

**మూడు ప్రధాన పార్టీల్లో కీలక బాధ్యతలు**


రాజకీయ జీవితంలో సమ్రాట్ చౌధరీ మూడు ప్రధాన పార్టీల్లో కీలక బాధ్యతలు నిర్వహించారు. లాలూప్రసాద్ యాదవ్?కు చెందిన ఆర్‌జేడీలో 1990లలో సమ్రాట్ రాజకీయ జీవితం ప్రారంభించారు. 1999లో రబ్రీ దేవి ప్రభుత్వంలో అతితక్కువ వయస్సులో వ్యవసాయ మంత్రిగా పనిచేశారు. అయితే వయస్సుకు సంబంధించి చెలరేగిన వివాదాల కారణంగా ఆయన రాజీనామా చేయాల్సి వచ్చింది. 2014లో జేడీయూలో చేరిన సమ్రాట్, ఆ పార్టీలో చీలిక తెచ్చి తిరుగుబాటు నేతగా నిలిచారు. తర్వాత 2018లో కాషాయ కండువా కప్పుకున్న ఆయన, బీజేపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడిగా, 2023లో రాష్ట్ర అధ్యక్షుడిగా సైతం బాధ్యతలు నిర్వహించారు. 2021--22లో నీతీశ్ కుమార్ నేతృత్వంలోని ఎన్?డీయే ప్రభుత్వంలో ఉప ముఖ్యమంత్రిగా పనిచేశారు. 2025 ఎన్నికల తర్వాత మరోసారి ఉపముఖ్యమంత్రి బాధ్యతలు చేపట్టిన సమ్రాట్, హోంశాఖ వ్యవహారాలను సైతం చక్కబెట్టారు.

# ఆర్టికల్ 370 రద్దు తర్వాత పూర్తిగా అమల్లోకి రాజ్యాంగం

డాక్టర్ బీఆర్అంబేడ్కర్ ఆశయాల మేరకు రాజ్యాంగ గౌరవాన్ని పునరుద్ధరించేందుకు ప్రభుత్వం కృషి చేస్తోందని ప్రధానమంత్రి నరేంద్ర మోదీ పేర్కొన్నారు. ఆర్టికల్ 370 రద్దు తర్వాత దేశవ్యాప్తంగా రాజ్యాంగం పూర్తిగా అమల్లోకి వచ్చిందని తెలిపారు. ఉమ్మడి పౌరస్మృతిని అమలు చేసిన తొలి రాష్ట్రంగా ఉత్తరాఖండ్ నిలించిందని కొనియాడారు. మంగళవారం దిల్లీ-దెహ్రాదూన్ ఎకనామిక్ కారిడార్‌ను ప్రధాని మోదీ ప్రారంభించారు. అనంతరం ఏర్పాటు చేసిన బహిరంగ సభలో మాట్లాడుతూ ఈ మేరకు వ్యాఖ్యలు చేశారు. చట్టసభల్లో మహిళలకు 33 శాతం రిజర్వేషన్లు అమల్లో జాప్యం జరగడానికి వీల్లేదని ప్రధాని నరేంద్ర మోదీ స్పష్టం చేశారు. 'ఈ రోజు అంబేడ్కర్ జయంతి. ఆయనకు నేను హృదయపూర్వక నివాళులు అర్పిస్తున్నా. అంబేడ్కర్ సామాజిక న్యాయానికి జీవితాంతం పోరాడారు. అదే దిశగా ప్రభుత్వం పనిచేస్తోంది. మౌలిక వసతులు, పరిశ్రమల అభివృద్ధి ద్వారా సమగ్ర ప్రగతి సాధ్యం అవుతుంది. ఆర్టికల్370 రద్దు తర్వాత రాజ్యాంగం పూర్తిగా అమల్లోకి వచ్చింది. మావోయిస్టు ప్రభావిత జిల్లాలు కూడా ఇప్పుడు రాజ్యాంగబద్ధంగా పనిచేస్తున్నాయి. ఉమ్మడి పౌర స్మృతిని అమలు చేయాలని మన రాజ్యాంగం మన నుంచి ఆశిస్తోంది. ఉత్తరాఖండ్ దీనిని ముందుకు తీసుకువెళ్లి దేశానికి ఒక మార్గాన్ని చూపింది' అని ప్రధాని మోదీ తెలిపారు.

**'2029 నుంచే అమలు కావాలి'**

నాలుగు దశాబ్దాల నిరీక్షణ తర్వాత పార్లమెంట్? నారీశక్తి వందన్ అదినియం ఆమోదించిందని ప్రధాని మోదీ తెలిపారు. 'మన సోదరీమణులు, అడబిడ్డల సంక్షేమం, రక్షణ, ప్రజాస్వామ్యంలో భాగస్వామ్యం అనేది డబుల్ సర్కార్ అత్యధిక ప్రాధాన్యాల్లో ఒకటి. శాసనసభలు, లోక్‌సభలో మహిళలకు 33 శాతం రిజర్వేషన్లు ఖరారయ్యాయి. అన్ని



పార్టీలు ముందుకొచ్చి ఈ గొప్ప బిల్లుకు మద్దతు ఇచ్చాయి. మహిళలకు లభించిన ఈ హక్కు అమల్లో జాప్యం జరగడానికి వీల్లేదు. 2029లో లోక్‌సభ ఎన్నికలు జరుగుతాయి. ఆ తర్వాత అసెంబ్లీ ఎన్నికలు కూడా జరుగుతూ ఉంటాయి. 2029 నుంచే ఈ రిజర్వేషన్లు అమలు కావాలి. ఇది దేశంలో ప్రతీ సోదరి, ఆడవిడ్డ కోరిక. మాతృశక్తి ఆకాంక్షను గౌరవిస్తూ ఏప్రిల్ 16 నుంచి పార్లమెంటులో చర్చలు జరుగుతాయి. మహిళలకు సంబంధించిన ఈ పనిని అన్ని పార్టీలు కలిసి ఏకాభిప్రాయంతో పూర్తి చేయాలి' అని ప్రధాని మోదీ తెలిపారు.

**దేవభూమిని శుభ్రంగా ఉంచండి : ప్రధాని మోదీ**

హరిద్వార్‌లో జరగబోయే కుంభమేళాను వైభవోపేతంగా, దివ్యంగా, పరిశుభ్రంగా నిర్వహించాలని కూడా ప్రధాని మోదీ పిలుపునిచ్చారు. 'ప్లాస్టిక్ సీసాల కుప్పలు, చెత్తా చెదారం దేవభూమి పవిత్రతకు హాని కలిగిస్తున్నాయి. అందువల్ల, మన పుణ్యక్షేత్రాలైన దేవభూమి ప్రదేశాలను పరిశుభ్రంగా, అందంగా ఉంచుకోవడం చాలా ముఖ్యం. వచ్చే ఏడాది హరిద్వార్‌లో కుంభమేళా కూడా జరగనుంది. ఈ విశ్వాస సంగమాన్ని దివ్యంగా, వైభవంగా, పరిశుభ్రంగా తీర్చిదిద్దేందుకు మనం అన్ని విధాలా కృషి చేయాలి' అని ప్రధాని మోదీ తెలిపారు.

**'ఏడాది పొడవునా టూరిజం అవసరం'**

ఉత్తరాఖండ్?లో 12 నెలల పర్యటకం రాష్ట్ర ఆర్థికాభివృద్ధికి ఎంతో కీలకమని ప్రధాని తెలిపారు. ముఖ్యంగా శీతాకాలంలో కూడా పర్యటకులను ఆకర్షించేలా రాష్ట్రం ముందుకు వస్తోందని చెప్పారు. వింటర్ టూరిజం, వింటర్ స్పోర్ట్స్, డెస్టినేషన్ వెడ్డింగ్స్‌కు ఉత్తరాఖండ్ ప్రముఖ కేంద్రంగా మారుతోందని పేర్కొన్నారు. ప్రధాని తన 2023 పర్యటనలో కైలాస్, ఓం పర్వత్ సందర్శించిన విషయాన్ని గుర్తుచేశారు. అప్పటి నుంచి యాత్రికుల సంఖ్య గణనీయంగా పెరిగిందని చెప్పారు. స్థానికులకు ఉపాధి అవకాశాలను పెంచిందని తెలిపారు. ఉత్తరాఖండ్ సహజ అందాలను, పవిత్రతను కాపాడితేనే పర్యటకం దీర్ఘకాలంగా అభివృద్ధి చెందుతుందని ప్రధాని పేర్కొన్నారు.

దిల్లీ-దెహ్రాదూన్ ఎకనామిక్ కారిడార్ వల్ల ఈ రెండు నగరాల మధ్య ప్రయాణ సమయం ఆరు గంటల నుంచి సుమారు 3 గంటలకు తగ్గనుంది. 213 కిలోమీటర్ల పొడవైన 6 వరుసల ఎకనామిక్ కారిడార్‌ను 12వేల కోట్లతో నిర్మించారు. మొదట సహారన్‌పూర్‌లో ఎకనామిక్ కారిడార్‌లో భాగంగా నిర్మించిన ఎలివేటెడ్ సెక్షన్‌లో వన్యప్రాణుల కారిడార్‌ను ప్రధాని పరిశీలించారు. సహారన్‌పూర్, దెహ్రాదూన్ వీధుల్లో రోడ్ షో నిర్వహించారు.దెహ్రాదూన్ సమీపంలోని మా దత్ కాళీ ఆలయంలో ప్రధాని ప్రత్యేక పూజలు నిర్వహించారు.

## ఛత్తీస్‌గఢ్ పవర్‌ప్లాంట్‌లో బాయిలర్ పేలుడు



ఛత్తీస్‌గఢ్‌లో ఘోర ప్రమాదం జరిగింది. ఒక పవర్ ప్లాంట్‌లోని బాయిలర్ పేలిన ఘటనలో 10 మంది మరణించగా, 40 మంది గాయపడ్డట్లు తెలుస్తోంది. ఈ ఘటన ఛత్తీస్‌గఢ్, శక్తి జిల్లా, సింగితారి గ్రామ సమీపంలోని వేదాంత పవర్ ప్లాంట్‌లో మంగళవారం మధ్యాహ్నం రెండు గంటల సమయంలో జరిగింది. ప్రాథమిక సమాచారం ప్రకారం.. పవర్ ప్లాంట్‌లోని బాయిలర్ ఉన్నట్లుండి పేలిపోయింది. ఘటన జరిగినప్పుడు చాలా మంది కార్మికులు పరిశ్రమ లోపల పని చేస్తున్నారు. ఈ పేలుడు భారీగా ఉండటంతో అక్కడ పని చేస్తున్న కార్మికుల్లో 10 మంది మరణించారు. మరో 30 నుంచి 40 మంది వరకు గాయపడ్డారు. ఈ ఘటనతో అక్కడ తొక్కిసలాట లాంటి పరిస్థితి తలెత్తింది. పేలుడు జరగడంతో అక్కడి కార్మికులు పారిపోయేందుకు ప్రయత్నించగా, ఇంకొందరు గాయపడ్డట్లు తెలుస్తోంది. ఘటనపై సమాచారం అందుకున్న పోలీసులు, అధికారులు అక్కడికి చేరుకుని సహాయక చర్యలు ప్రారంభించారు. గాయపడ్డవారిని స్థానిక ఆస్పత్రులకు తరలించి చికిత్స అందిస్తున్నారు. వీరిలో చాలా మంది పరిస్థితి విషమంగా ఉన్నట్లు తెలుస్తోంది. ఇంకా సహాయక చర్యలు కొనసాగుతున్నాయి. పేలుడుకు గల కారణాలు ఇంకా తెలియరాలేదు. ప్రమాదం జరిగిన ప్రదేశంలో దృశ్యాలు హృదయవిదారకంగా ఉన్నాయి. అయితే, ఈ అంశంపై ఇప్పటివరకు అధికారికంగా ఎలాంటి సమాచారం వెల్లడించలేదు.

## రాజ్యాంగాన్ని బీజేపీ, ఆరెస్సెస్ ఆలోచనలు ధ్వంసం చేస్తున్నాయి



బంగాల్ అసెంబ్లీ ఎన్నికల సమయం దగ్గరపడుతున్న తరుణంలో రాజకీయాలు వేడెక్కాయి. అధికార, విపక్షాలు ఒకరిపై ఒకరు తీవ్ర ఆరోపణలు చేసుకుంటున్నారు. ఈ క్రమంలో కాంగ్రెస్ అగ్రనేత, లోక్‌సభ ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ, బీజేపీ ఆరెస్సెస్‌పై తీవ్ర స్థాయిలో విరుచుకుపడ్డారు. విద్వేషంతో నిండిన బీజేపీ, ఆరెస్సెస్ ఆలోచనలు రాజ్యాంగాన్ని ధ్వంసం చేస్తున్నాయని ఆరోపించారు. కాషాయ పార్టీ ఓట్ల దొంగతనానికి పాల్పడుతోందని విమర్శించారు. బంగాల్‌లోని ఉత్తర్‌దినౌజ్‌పూర్ జిల్లాలో ఎన్నికల ప్రచారంలో పాల్గొన్న రాహుల్ గాంధీ ఈ మేరకు వ్యాఖ్యానించారు. "బంగాల్‌లో త్వరలో అసెంబ్లీ ఎన్నికలు జరగనున్నాయి. ఈ పోరులో బీజేపీ పార్టీ ఉంది. వారిది విద్వేషపూరిత భావజాలం, హింసను ప్రేరేపిస్తారు. వారి ప్రధానమంత్రి కూడా ఒక రాజీ పడిన వ్యక్తి, అలాంటి వారి గురించి మాట్లాడాల్సిన అవసరమే లేదు. అదేవిధంగా, బంగాల్‌లో టీఎంసీ పార్టీ కూడా ఉంది. ఈ టీఎంసీ పార్టీయే బీజేపీకి దారి చూపిస్తోంది. ఒకవేళ టీఎంసీ తన బాధ్యతలను సరిగ్గా నిర్వర్తించి ఉంటే, మీకు సరైన ఉపాధిని కల్పించి ఉంటే, ద్వేషాన్ని వ్యాప్తి చేయకుండా ఉండి ఉంటే, అప్పుడు ఇక్కడ బీజేపీకి చోటే ఉండేది కాదు. అసలు బంగాల్‌లో బీజేపీ ఎక్కడా కనిపించేది కూడా కాదు."

**'బీజేపీ ప్రజాస్వామ్యాన్ని నాశనం చేస్తోంది'**

మరోవైపు, బీజేపీ ప్రజాస్వామ్యాన్ని నాశనం చేస్తోందని రాహుల్? గాంధీ ధ్వజమెత్తారు. బంగాల్‌లో బీజేపీ ఓటు చోరీ చేసేందుకు సీఎం మమతాబెనర్జీ నేతృత్వంలోని తృణమూల్ కాంగ్రెస్ ప్రభుత్వమే అవకాశం ఇచ్చిందని దుయ్యబట్టారు. యువతకు ఉద్యోగాలు కల్పిస్తామని అధికారంలోకి వచ్చిన టీఎంసీ, ఆ పని చేయలేకపోయిందని విమర్శలు గుప్పించారు. ఐదు లక్షల మందికి ఉద్యోగాలు ఇస్తామని సీఎం మమతా వాగ్దానం చేశారని, అయితే, రాష్ట్రంలో మాత్రం 84 లక్షల మంది యువత నిరుద్యోగ భృతి కోసం దరఖాస్తు చేసుకున్నారని ఆయన గుర్తుచేశారు. మరోవైపు, ఓటర్ల జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ (ఎస్ఐఆర్)పై కూడా రాహుల్ గాంధీ మాట్లాడారు. ఎస్ఐఆర్ ప్రక్రియ కారణంగా బంగాల్‌లో చాలా మంది పేర్లు ఓటర్ల జాబితా నుంచి తొలగించారని, అయితే కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పాటు చేసిన తర్వాత తొలగింపునకు గురైన వారి పేర్లను తిరిగి చేర్చుతామని హామీ ఇచ్చారు. కాషాయ శిబిరానికి వ్యతిరేకంగా నిలబడి ఓడించగల ఏకైక పార్టీ కాంగ్రెస్ మాత్రమేనని రాహుల్? పేర్కొన్నారు.

**బంగాల్‌లో నిరుద్యోగానికి టీఎంసీయే కారణం**

అదేవిధంగా, బంగాల్‌లో నిరుద్యోగానికి టీఎంసీయే కారణమని రాహుల్? గాంధీ ఆరోపించారు. టీఎంసీ బంగాల్‌లోని అన్ని పరిశ్రమలను మూసివేసి, సిండికేట్ల ద్వారా రాష్ట్రాన్ని నడుపుతోందని ఆరోపించారు. ఈ సందర్భంగా శారదా, రోజ్ వ్యాలీ కేసుల వంటి పాంజీ స్కామ్‌లను ప్రస్తావించారు. టీఎంసీ సభ్యులు నడుపుతున్న సిండికేట్లు, లంచగొండితనం ద్వారా లబ్ధి పొందుతున్నాయని ఆరోపించారు. టీఎంసీ హింసకు పాల్పడుతోందని, తప్పుడు వాగ్దానాలు చేస్తోందని కూడా రాహుల్ విమర్శించారు. ఇదిలా ఉండగా, బంగాల్‌లో కాంగ్రెస్ పార్టీ ఇస్తున్న ఐదు హామీల గురించి రాహుల్ గాంధీ ప్రస్తావించారు. మెరుగైన ఆరోగ్య సేవలు, విద్య, రైతులకు మద్దతు, యువతకు ఉద్యోగ అవకాశాలు, మహిళలకు నెలవారీ ఆర్థిక సహాయం అందిస్తుందని పేర్కొన్నారు. రూ.10 లక్షల వరకు ఆరోగ్య బీమా, జిల్లా ఆసుపత్రుల్లో ఉచిత డయాలసిస్, క్యాన్సర్ చికిత్సను అందిస్తుందని ఆయన పేర్కొన్నారు. అలాగే, విద్యార్థులకు గ్రాడ్యుయేషన్ వరకు, మహిళలకు పీజీ వరకు ఉచిత విద్య అందిస్తామని హామీ ఇచ్చారు. అదనంగా, పాఠశాలల్లో ఏఐ, ఆంగ్లంలో విద్య కూడా అందిస్తామని తెలిపారు. రైతులకు ఏటా రూ.15,000 సహాయం, 200 యూనిట్ల ఉచిత విద్యుత్‌ను అందిస్తామని ఆయన ఇంకా హామీ ఇచ్చారు.

## హైవేలపై ఓవర్ లోడ్‌తో వెళ్లే వాహనాల ఫీజుకు సంబంధించి కొత్త రూల్స్

**- ఏప్రిల్ 15 నుంచి నిబంధనలు అమల్లోకి!**

జాతీయ రహదారులపై ఓవర్ లోడ్‌తో వెళ్లే వాహనాల నిబంధనల అమలును పటిష్టం చేయడం, హేతుబద్ధమైన ఫీజులు వసూలును నిర్ధారించటమే లక్ష్యంగా కేంద్రం కీలక నిర్ణయం తీసుకుంది. జాతీయ రహదారుల ఫీజు (రేట్ల నిర్ధారణ, వసూలు) నాలుగో సవరణ నిబంధనలు 2026ను నోటిఫై చేసింది. ఈ సవరించిన నిబంధనలు 2026 ఏప్రిల్ 15 నుంచి అమల్లోకి వస్తాయని కేంద్ర రోడ్డు రవాణా, రహదారుల మంత్రిత్వ శాఖ మంగళవారం ప్రకటన విడుదల చేసింది.


**కేంద్ర రోడ్డు రవాణా, రహదారుల మంత్రిత్వ శాఖ ప్రకటన ప్రకారం**

నిర్దేశించిన లోడు పరిమితులను పాటించడాన్ని ప్రోత్సహించడం, రహదారి మౌలిక సదుపాయాలను పరిరక్షిస్తూ రోడ్డు భద్రతను పెంచడం ఈ సవరణ లక్ష్యమని కేంద్ర రవాణా, రహదారుల మంత్రిత్వ శాఖ తెలిపింది. సవరించిన రుసుము విధానం ప్రకారం, ఓవర్ లోడ్‌తో వెళ్తున్న వాహనాలకు లోడు శాతాన్ని బట్టి రుసుము విధిస్తామని స్పష్టం చేసింది. 10 శాతం వరకు ఓవర్ లోడ్‌తో వెళ్లే వాహనాలకు ఎలాంటి ఓవర్ లోడ్ రుసుము విధించమని పేర్కొంది. అయితే 10-40 శాతం వరకు ఓవర్ లోడ్‌తో వెళ్లే వాహనాలకు ప్రాథమిక రుసుముకు రెట్టింపు ఫీజును విధిస్తామని వెల్లడించింది. 40 శాతానికి పైగా ఓవర్ లోడుతో వెళ్లే వాహనాలకు ప్రాథమిక రుసుముకు నాలుగు రెట్లు అధికంగా ఫీజు వసూలు చేస్తామని చెప్పింది.

# తారెత్తిస్తున్న ఎండలు, వడగాడ్పులు

-మొదటిపేజీ తరువాయి

45 డిగ్రీల గరిష్ఠ ఉష్ణోగ్రత నమోదైందని, 262 మండలాల్లో 40 డిగ్రీలకుపైగా ఉష్ణోగ్రతలు నమోదు అయినట్లు విపత్తుల నిర్వహణ సంస్థ అధికారులు వెల్లడించారు. రేపు రాయలసీమ, కోస్తా జిల్లాల్లో 42-44 డిగ్రీల మధ్య గరిష్ఠ ఉష్ణోగ్రతలు నమోదయ్యేందుకు అవకాశం ఉందని తెలిపారు. అదే విధంగా రాష్ట్రవ్యాప్తంగా 46 మండలాల్లో తీవ్ర వడగాల్పులు వీచే అవకాశం ఉన్నట్లు తెలిపారు. శ్రీకాకుళం జిల్లాలో 4 మండలాలు, విజయనగరం జిల్లాలో 19, పార్వతీపురం మన్యం జిల్లాలో 14, అల్లూరి సీతారామరాజు జిల్లాలో 1, పోలవరం జిల్లాలో 4, అనకాపల్లి జిల్లాలో 2, కాకినాడ జిల్లాలో 1, తూర్పుగోదావరి జిల్లాలో 1 మండలాల్లో తీవ్ర వడగాల్పులు, 73 మండలాల్లో వడగాల్పులు వీచే అవకాశం ఉందని తెలిపారు.



**ఈ జాగ్రత్తలు తప్పనిసరి**


వడగాడ్పుల తరుణంలో ఎండలో బయటకు వెళ్లేప్పుడు తలకి టోపి పెట్టుకోవాలని, తెలుపురంగు కాటన్ వస్త్రాలను ధరించాలని అధికారులు చెప్తున్నారు. కళ్ల రక్షణ కోసం సన్ గ్లాసెస్ ఉపయోగించాలని, చెవుల్లోకి వేడిగాలి వెళ్లకుండా జాగ్రత్త పడాలని, గుండె సంబంధిత వ్యాధులు, షుగర్, బీపీ ఉన్నవారు ఎండలో తిరగరాదని అదే విధంగా నిమ్మకాయ నీరు, మజ్జిగ, కొబ్బరి నీరు, మంచినీరు ఎక్కువగా తీసుకోవాలని సూచిస్తున్నారు.

నగరాల్లో పగటిపూట ప్రయాణించేవారు టోపీలు, మాస్కులు, మహిళలైతే ముఖానికి వస్త్రాలు రక్షణగా ధరిస్తున్నారు. ఇక విద్యార్థులు, ఉద్యోగులు, కూలీలు ఎండలోనే ప్రయాణిస్తున్నారు. కొందరు వేసవి నుంచి ఉపశమనం కోసం చలివేంద్రాలను ఆశ్రయిస్తున్నారు. కొందరు కొబ్బరి బోండాలు, శీతల పానీయాల బళ్ల వద్దకు చేరుతున్నారు. భూతాపంతో ఎండలు ఎక్కువగా ఉండే విజయవాడ వంటి ప్రాంతంలో అధిక ఉష్ణోగ్రతలు నగర వాసుల్ని ఉక్కిరిబిక్కిరి చేస్తున్నాయి. వడదెబ్బ వల్ల నమోదైన కేసులు: ఎండలు, వడగాడ్పుల వల్ల వడదెబ్బలు తగిలే ప్రమాదం లేకపోలేదు. రాష్ట్రంలో 2023లో 833, 2024లో 4,444, 2025లో 5,154 చొప్పున వడదెబ్బ కేసులు నమోదయ్యాయి. 2025లో అత్యధికంగా ఏలూరు జిల్లాలో 1,284, కృష్ణా జిల్లాలో 1,214, విశాఖలో 1,089, కడపలో 325, పల్నాడు జిల్లాలో 268 చొప్పున వడదెబ్బ కేసుల నమోదయ్యాయి.

# మంత్రులపై చంద్రబాబు ఆగ్రహం

# కేబినెట్ మార్పు చేర్పుల సమీకరణాలు


**విజయవాడ :** ఆంధ్రప్రదేశ్ రాజకీయాల్లో ప్రస్తుతం ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు మంత్రులపై ప్రదర్శిస్తున్న అసహనం కేవలం పరిపాలనాపరమైన కోపమే కాకుండా, రాబోయే భారీ రాజకీయ మార్పులకు సంకేతంగా కనిపిస్తున్నాయన్న అభిప్రాయం వినిపిస్తోంది. ముఖ్యంగా ఇటీవలి కేబినెట్ సమావేశంలో కేబినెట్ అజెండా మీడియాకు లీక్ అవ్వడంపై ఆయన స్పందించిన తీరు, మంత్రుల పనితీరుపై ఆయన ఇస్తున్న రేటింగ్స్.. త్వరలోనే ఏపీ మంత్రివర్గంలో మార్పుచేర్పులు ఉండబోతున్నాయనే అంచనాలను బలపరుస్తున్నాయి సచివాలయంలో జరిగిన కేబినెట్ భేటీలో, అజెండాలోని కీలక అంశాలు అధికారికంగా వెల్లడించక ముందే మీడియాలో రావడంపై చంద్రబాబు తీవ్రంగా మండిపడ్డారు. ఈ సందర్భంగా ఆయన దివంగత ఎన్టీఆర్ హయాంలో జరిగిన ఒక సంఘటనను గుర్తుచేశారు. బడ్జెట్ వివరాలు లీక్ అయినందుకు ఎన్టీఆర్ మొత్తం మంత్రివర్గాన్నే రద్దు చేసిన ఉదంతాన్ని ప్రస్తావిస్తూ.. గోప్యత పాటించలేని మంత్రులు ఉంటే ఎంత, లేకపోతే ఎంత అని నిలదీశారు. ఇది మంత్రులకు ఇచ్చిన ఆఖరి హెచ్చరికగా రాజకీయ వర్గాలు భావిస్తున్నాయి.చంద్రబాబు నాయుడు కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి దాదాపు రెండేళ్లు కావస్తోంది . సాధారణంగా చంద్రబాబు తన గత అనుభవాల దృష్ట్యా, ప్రభుత్వం సగం కాలం పూర్తి చేసుకునే సమయానికి మంత్రుల పనితీరుపై ఒక సమగ్ర నివేదిక సిద్ధం చేస్తారు. ప్రస్తుతం మంత్రుల గ్రాఫ్, ప్రజల్లో వారి ఇమేజ్, శాఖలపై పట్టు వంటి అంశాలను ఆయన నిశితంగా గమనిస్తున్నారు. ఎవరైతే ఆశించిన స్థాయిలో పని చేయడం లేదో, వారిని తప్పించి కొత్త రక్తానికి అవకాశం ఇవ్వాలనే ఆలోచనలో ఆయన ఉన్నట్లు తెలుస్తోంది.రాబోయే మూడు నాలుగు నెలల్లో ఆంధ్రప్రదేశ్‌లో మున్సిపల్ ఎన్నికలు జరగనున్నాయి. ఈ ఎన్నికలను సెమీఫైనల్స్‌గా భావిస్తున్న బాబు, పార్టీని క్షేత్రస్థాయిలో పటిష్టం చేసేందుకు సమర్థులైన నేతలకు



మంత్రి పదవులు ఇవ్వాలని భావిస్తున్నారు. కేబినెట్ అజెండాను కూడా ముందస్తుగా చదువుకోకుండా వస్తున్న మంత్రులపై ఆయన అసంతృప్తిగా ఉన్నారు. ఎన్నికల సమయానికి ప్రజల్లో మంచి మైలేజ్ ఉన్న నేతలతో కూడిన కొత్త టీమ్ ను రంగంలోకి దించే అవకాశం ఉంది.అజెండా కాపీలు ఎవరు లీక్ చేస్తున్నారో, ఏ మంత్రులు మీడియా ప్రతినిధులతో అతిగా సాన్నిహిత్యం నెరుపుతున్నారో తనకు తెలుసని చంద్రబాబు సంకేతాలిచ్చారు. ఇది మంత్రులలో ఒక రకమైన భయాన్ని కల్పించింది. కేవలం లీకులే కాకుండా, శాఖా పరమైన నిర్ణయాల్లో జాప్యం, కేంద్ర పథకాల అమలులో నిర్లక్ష్యం వంటివి కూడా బాబు అసహనానికి కారణమయ్యాయి.ఈసారి మంత్రివర్గ మార్పుల్లో నారా లోకేష్ మార్క్, అలాగే కూటమి ధర్మం ప్రకారం జనసేన అధినేత పవన్ కళ్యాణ్ సూచనలు కూడా కీలకం కానున్నాయి. యువ నేతలకు ప్రాధాన్యత పెంచడం, సామాజిక సమీకరణాలను సమతుల్యం చేయడం ముఖ్యంగా ఉత్తరాంధ్ర, రాయలసీమ ప్రాంతాల్లో వంటి అంశాల ఆధారంగా కొత్త మంత్రుల ఎంపిక ఉండవచ్చు. పనితీరు బాలేని సీనియర్లను పార్టీ బాధ్యతలకు పరిమితం చేసి, చురుకైన వారిని కేబినెట్‌లోకి తీసుకునే అవకాశం మెండుగా ఉంది. చంద్రబాబు సీరియస్ లుక్ వెనుక ఒక పెద్ద క్లీనింగ్ ప్రాసెస్ దాగి ఉందని అర్థమవుతోంది. పరిపాలనలో క్రమశిక్షణ తప్పితే ఎంతటి వారినైనా తప్పిస్తాననే సందేశాన్ని ఆయన బలంగా పంపారు. మున్సిపల్ ఎన్నికల నోటిఫికేషన్ వచ్చేలోపే లేదా రెండేళ్ల పాలన ముగిసిన వెంటనే ఏపీ కేబినెట్‌లో భారీ మార్పులు జరగడం దాదాపు ఖాయమని చెప్పవచ్చు.

# ఏపీలో కొత్తగా మరో 30 ఇండస్ట్రియల్ క్లస్టర్లు

**కడప :** ఏపీ ప్రభుత్వం మూడు ఇండస్ట్రియల్ కారిడార్ల వెంట కొత్తగా మరో 30 ఇండస్ట్రియల్ క్లస్టర్లను ఏర్పాటు చేయాలని ప్లాన్ చేసింది. గతంలో 20 కస్టర్లు ఏర్పాటు చేయగా.. వాటికి తోడు మరో 30 కలిపి మొత్తం 50 రానున్నాయి. ఈ మేరకు ఏపీ ప్రభుత్వం ప్రతిపాదనల్ని కేంద్రానికి కూడా పంపింది. ఇప్పటికే ఆయా జిల్లాల్లో భూముల్ని కూడా గుర్తించారు అధికారులు.ఆంధ్రప్రదేశ్ మీదుగా కేంద్రం మూడు ఇండస్ట్రియల్ కారిడార్లను అభివృద్ధి చేస్తోంది. విశాఖపట్నం-చెన్నై, చెన్నై-బెంగళూరు, హైదరాబాద్-బెంగళూరు పారిశ్రామిక కారిడార్లు ఉన్నాయి. విశాఖపట్నం-చెన్నై ఇండస్ట్రియల్ కారిడార్ మొదటి దశ పనులు ముగింపు దశకు చేరాయి. చెన్నై-బెంగళూరు ఇండస్ట్రియల్ కారిడార్ పరిధిలో తిరుపతి, చిత్తూరు జిల్లాల్లో నోడ్‌లను ప్రభుత్వం అభివృద్ధి చేస్తోంది. హైదరాబద్-బెంగళూరు కారిడార్ పరిధిలోని అనంతపురం, కర్నూలు జిల్లాలో పారిశ్రామిక నోడ్‌లను అభివృద్ధి చేస్తోంది. ఇప్పటికే ఈ మూడు కారిడార్ల వెంట 20 ఇండస్ట్రియల్ కస్టర్లను ప్రభుత్వం అభివృద్ధం చేసింది. వీటితో పాటుగా మరో 30 క్లస్టర్లను అభివృద్ధి చేయాలని టార్గెట్ పెట్టుకుంది.ఈ మూడు ఇండస్ట్రియల్ కారిడార్ల వెంట 30 ఇండస్ట్రియల్ కస్లర్టలను అభివృద్ధి చేయాలని ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం నిర్ణయించింది. ప్రస్తుతం ఉన్న 20 క్లస్టర్లకు ఈ 30 కలిపితే 50 క్లస్టర్లు అందుబాటులోకి వస్తాయని చెబుతున్నారు. కొత్తగా తెరపైకి తీసుకొచ్చిన ఈ 30 క్లస్టర్ల కోసం అధికారులు దాదాపు 1.31 లక్షల ఎకరాల భూమిని కూడా గుర్తించినట్లు తెలుస్తోంది. ఏపీ ప్రభుత్వం ప్రతిపాదించిన క్లస్టర్లు.. శ్రీకాకుళం జిల్లాలో 2, విశాఖపట్నం జిల్లాలో 4, కృష్ణాలో 1, గుంటూరు జిల్లాలో 1, నెల్లూరు జిల్లాలో 3, తిరుపతి జిల్లాలో 5, చిత్తూరు జిల్లాలో 4, అనంతపురం జిల్లాలో 3, శ్రీసత్యసాయి జిల్లాలో 1, కడప జిల్లాలో 3, కర్నూలు జిల్లాలో 1, ప్రకాశం జిల్లాలో 2 ఉన్నాయి. ఈ ఇండస్ట్రియల్ క్లస్టర్లను పొరుగు రాష్ట్రాల్లోని ప్రధాన రాష్ట్రాలకు కనెక్ట్ చేసేలా ప్లాన్ చేస్తోంది.రాష్ట్రంలో ఈ మూడు ఇండస్ట్రియల్ కారిడార్ల వెంట దాదాపు 74,583 ఎకరాల ముంపు భూముల్ని గుర్తించి వాటిలో 27వేల ఎకరాలను సేకరించారు. తీర ప్రాంతం వెంట దాదాపు 56,608 ఎకరాలు అందుబాటులో ఉన్నట్లు ప్రభుత్వం గుర్తించింది.. ఇప్పటికే 36వేల434 ఎకరాలను సేకరించింది. ముంపు ప్రాంతాల్లో 15.. తీర ప్రాంతం వెంట మరో 15 క్లస్టర్లు ప్లాన్ చేసినట్లు సమాచారం. ఈ భూముల్ని ఇండస్ట్రియల్ క్లస్టర్ల కోసం ఉపయోగించుకోవాలని భావిస్తున్నారు. ప్రధానంగా మారిటైంకు సంబంధించిన పరిశ్రమల్ని ఏర్పాటు చేయాలని భావిస్తున్నారు. ఈ క్లస్టర్ల ఏర్పాటుపై ప్రతిపాదనల్ని కేంద్రానికి పంపారు.. కేంద్రం అవసరమైన నిధులు కేటాయించనుండగా.. కొంత వాటాను ఏపీ ప్రభుత్వం భరించాల్సి ఉంటుంది.



## నారీ శక్తి వందన్ బిల్లుకు అందరూ మద్దతివ్వాలి

-మొదటిపేజీ తరువాయి

అధ్యక్షురాలు వైఎస్ షర్మిలా రెడ్డి, సీపీఐ రాష్ట్ర కార్యదర్శి జి.ఈశ్వరయ్య, సీపీఎం రాష్ట్ర కార్యదర్శి వి.శ్రీనివాసరావుకు ముఖ్యమంత్రి లేఖలు రాశారు.

**'నారీ శక్తి వందన్ అధినియం'**

మహిళలకు పార్లమెంట్, విధాన సభల్లో మూడో వంతు రిజర్వేషన్లు కల్పించాలనే ప్రధాని మోదీ సంకల్పాన్ని బలపరుద్దామని సీఎం విజ్ఞప్తి చేశారు. పార్లమెంట్‌లో మహిళా రిజర్వేషన్ల సవరణ బిల్లు ప్రవేశపెట్టే ఈ నెల 16వ తేదీ భారత ప్రజాస్వామ్యంలో చారిత్రక ఘట్టమని లేఖలో పేర్కొన్నారు. 'నారీ శక్తి వందన్ అధినియం' మహిళా సాధికారతతో పాటు దేశ ఉన్నతికి దోహదపడుతుందని అభిప్రాయపడ్డారు. భరతమాతను పూజించే దేశంగా నారీ శక్తికి వందనం పలుకుదామని ముఖ్యమంత్రి చంద్రబాబు పిలుపునిచ్చారు.

**'మహిళా రిజర్వేషన్లపై అంతా ఒకే స్వరం వినిపించాలి'**

ఎక్కడ మహిళలను గౌరవిస్తారో అక్కడ దేవతలు కొలువై ఉంటారని భారతీయ ధర్మం చెబుతోందన్న సీఎం దీనికి నిదర్శనమే 'నారీ శక్తి వందన్ అధినియం' అన్నారు. చట్టసభల్లో ఆడబిడ్డలకు 33 శాతం రిజర్వేషన్లు 2029 నుంచే అమల్లోకి వచ్చేలా చట్ట సవరణకు కేంద్రం సంకల్పించిందని వివరించారు. మహిళా రిజర్వేషన్లపై అంతా ఒకే స్వరం వినిపించాలని ఆడబిడ్డల తరపున బాధ్యతతో లేఖ రాస్తున్నట్లు సీఎం తెలిపారు. అన్ని రాజకీయ పార్టీలు, పార్లమెంట్ సభ్యులు ఏకగ్రీవంగా బిల్లుకు మద్దతు పలకాల్సిన అవసరం ఉందన్నారు. మన ఇంటి ఆడబిడ్డలను, మన దేశ మహిళలను గౌరవించుకునే ఈ అవకాశాన్ని మనందరం అదృష్టంగా భావిద్దామన్నారు. ఈ పవిత్ర ఘట్టంలో భాగస్వామ్యమయ్యే సందర్భాన్ని ఎవరూ వదులుకోవద్దని పిలుపునిచ్చారు.

చారిత్రాత్మక నిర్ణయం: భరతమాతను పూజించే దేశంగా నారీ శక్తికి వందనం పలికే గొప్ప క్షణాలకు 140 కోట్ల మంది భారతీయులు సిద్ధంగా ఉండాలని ముఖ్యమంత్రి చంద్రబాబు పిలుపునిచ్చారు. ఈ చట్టం రాజకీయాలకు అతీతం ఇది దేశ గౌరవానికి చెందిన విషయమని తెలిపారు. ప్రతీ పార్టీ, ప్రతీ ఎంపీ ఈ చారిత్రాత్మక నిర్ణయంలో తమ ముద్ర వేయాలని ఆకాంక్షించారు.

## ఈ ఏడాది వర్షాలు తక్కువే!

-మొదటిపేజీ తరువాయి

అంచనా 1971-2020 మధ్య కాలంలో దేశ సగటు వర్షపాతం 87 సెం.మీ.గా ఉంది. ఈ ఏడాది వర్షపాతం ఇందులో 90 నుంచి 95 శాతం మధ్య (సాధారణం కంటే తక్కువ) నమోదయ్యే అవకాశం ఎక్కువగా ఉందని ×వీణ అంచనా వేసింది. ప్రస్తుతం పసిఫిక్ మహాసముద్రంలో బలహీన ఎల్?నినో పరిస్థితులు తటస్థ స్థితికి మారుతున్నాయని అయితే రుతుపవన కాలంలో ఎల్?నినో పరిస్థితులు ఏర్పడే అవకాశం ఉందని వాతావరణ శాఖ హెచ్చరించింది. ఇది సాధారణంగా వర్షాలపై ప్రతికూల ప్రభావం చూపుతుందని వాతావరణ శాఖ హెచ్చరించింది. హిందూ మహాసముద్రంలో ప్రస్తుతం తటస్థ పరిస్థితులు ఉన్నప్పటికీ, సీజన్ ముగిసే సమయానికి 'పాజిటివ్ ఐఓడీ' ఏర్పడే అవకాశం ఉందని వాతావరణ మోడల్స్ సూచిస్తున్నాయి.

దేశంలోని మెజారిటీ ప్రాంతాల్లో సాధారణం కంటే తక్కువ వర్షపాతం నమోదయ్యే అవకాశం ఉన్నప్పటికీ, ఈశాన్య, వాయువ్య ప్రాంతాల్లో సాధారణం కంటే ఎక్కువ వర్షాలు కురిసే అవకాశం ఉందని ఐఎండీ వెల్లడించింది. నైరుతి రుతుపవనాల గమనానికి సంబంధించి మరిన్ని ఖచ్చితమైన వివరాలతో కూడిన రెండో విడత అంచనాలను మే చివరి వారంలో విడుదల చేస్తామని వాతావరణ శాఖ తెలిపింది. అప్పుడు ప్రాంతాల వారీగా వర్షపాత వివరాలను వెల్లడించనున్నారు. తారెత్తిస్తున్న ఎండలు, వడగాడ్పులు: ఇదిలా ఉండగా రాష్ట్రంలో రోజురోజుకీ ఎండలు, వడగాడ్పులు తారెత్తిస్తున్నాయి. ఉదయం 10 గంటలు దాటిందంటే ప్రజల ఇళ్ల నుంచి బయటకు వచ్చేందుకు భయపడతున్నారు. ఎండ తీవ్రత, వడగాల్పులు, ఉక్కపోత పట్ల ప్రజలు మరింత అప్రమత్తంగా ఉండి తగిన జాగ్రత్తలు తీసుకోవాలని సూచిస్తున్నారు. వడగాడ్పుల తరుణంలో ఎండలో బయటకు వెళ్లేప్పుడు తలకి టోపి పెట్టుకోవాలని, తెలుపురంగు కాటన్ వస్త్రాలను ధరించాలని అధికారులు చెప్తున్నారు. కళ్ల రక్షణ కోసం సన్ గ్లాసెస్ ఉపయోగించాలని, చెవుల్లోకి వేడిగాలి వెళ్లకుండా జాగ్రత్త పడాలని, గుండె సంబంధిత వ్యాధులు, షుగర్, బీపీ ఉన్నవారు ఎండలో తిరగరాదని అంటున్నారు. నిమ్మకాయ నీరు, మజ్జిగ, కొబ్బరి నీరు, మంచినీరు ఎక్కువగా తీసుకోవాలని సూచిస్తున్నారు.

## 45 లక్షల మందికి క్వాంటం.. ఏఐ నైపుణ్యాల్లో శిక్షణ



-మొదటిపేజీ తరువాయి

మాట్లాడుతూ..'ప్రపంచ క్వాంటం దినోత్సవాన్ని పురస్కరించుకుని భారత మొట్టమొదటి క్వాంటం రిఫరెన్సు ఫెసిలిటీని ప్రారంభించటం సంతోషంగా ఉంది. ఎస్ఆర్ఎం యూనివర్సిటీలో 1ఎస్ ఓపెన్ యాక్సెస్ క్వాంటం ఫెసిలిటీ, మేథాటవర్స్‌లో 1 క్యూ పేరిట మరో క్వాంటం సిస్టం ఏర్పాటు చేశారు. ప్రపంచ క్వాంటం దినోత్సవాన్ని పురస్కరించుకుని శాస్త్రవేత్తలు, పరిశోధకులు, విద్యార్థులు, ప్రజలకు శుభాకాంక్షలు తెలియ చేస్తున్నాను. క్వాంటం సైన్స్ వంద ఏళ్లు పూర్తైన సందర్భంగా ప్రపంచ క్వాంటం దినోత్సవం రోజున దీన్ని సాకారం చేసుకుని చరిత్ర సష్టించాం. విజ్ఞానమే సామాజిక ప్రగతికి చిహ్నం అని చెప్పిన అంబేద్కర్ గారి జయంతిని పురస్కరించుకుని అమరావతిలో క్వాంటం కంప్యూటర్ రిఫరెన్స్ ఫెసిలిటీని ప్రారంభించుకున్నాం. క్వాంటం టెక్నాలజీని పరిశోధకులకు, కంపెనీలకు, విద్యార్థులకు అందుబాటులో ఉంచేలా ఈ టెస్ట్ బెడ్‌లను ఏర్పాటు చేయటంపై అందరికీ అభినందనలు. భారత తొలి ఓపెన్--యాక్సెస్ క్వాంటం ఫెసిలిటీలతో పాటు అమరావతి క్వాంటం వ్యాలీ ఏర్పాటుకు ప్రోత్సహిస్తోన్న ప్రధాని మోదీకి ధన్యవాదాలు. ఏక్యూవీ ని వేగంగా పూర్తి చేయటంలో సహకరిస్తున్న కేంద్ర మంత్రి జితేంద్ర సింగ్, కార్యదర్శి అభయ్ కరాండికర్‌కు ధన్యవాదాలు. అమరావతిలో ప్రారంభమైన 1ఎస్ ,1 క్యూ క్వాంటం హార్డ్‌వేర్ టెస్ట్‌బెడ్స్ క్వాంటం ఉపకరణాలను పరీక్షించడానికి, సర్టిఫై చేయడానికి కీలకం. దేశంలోని తొలి క్వాంటం కంప్యూటర్లకు ఆంధ్రప్రదేశ్ వేదిక అయినందుకు గర్విస్తున్నాను. ఐటీ రంగంలో కీలక పాత్ర పోషించిన తెలుగు గడ్డ ఇప్పుడు క్వాంటం టెక్నాలజీకి వేదికగా మారటం సంతోషదాయకం" అని ముఖ్యమంత్రి అన్నారు.

## కుంభమేళా తరహాలో గోదావరి పుష్కరాలు

-మొదటిపేజీ తరువాయి

ప్రధానంగా నిడదవోలు నియోజకవర్గంలో పంచాయతీరాజ్, గ్రామీణ అభివద్ధి శాఖల ద్వారా జరుగుతున్న అభివద్ధి వివరాలపై సమీక్షించారన్నారు..అదే విధంగా గోదావరి పుష్కరాల నిర్వహణపై దిశానిర్దేశం చేసినట్లు మంత్రి దుర్గేష్ వెల్లడించారు. 12 ఏళ్లకు ఒకసారి వచ్చే ఈ మహా ఉత్సవానికి సుమారు 10 కోట్ల మంది భక్తులు హాజరయ్యే అవకాశం ఉందని అంచనా వేశామని, భక్తుల సౌకర్యాలకు, భద్రతకు పెద్దపీట వేయాలని భావించినట్లు వెల్లడించారు. రాజమహేంద్రవరంతో పాటు గోదావరి పరివాహక ప్రాంతాల్లోని ఘాట్ల ఆధునీకరణ పనులు ఇప్పటికే ప్రారంభమయ్యాయని మంత్రి దుర్గేష్ పేర్కొన్నారు. భక్తుల కోసం ప్రత్యేక వసతులు, మంచినీరు, పారిశుద్ధ్యం మరియు విశ్రాంతి గదుల ఏర్పాటుపై ప్రత్యేక దష్టి సారిస్తున్నట్లు పేర్కొన్నారు. కోట్లాదిగా తరలివచ్చే భక్తుల భద్రతకు పెద్దపీట వేయాలని, ట్రాఫిక్ ఇబ్బందులు తలెత్తకుండా సమగ్ర కార్యాచరణను సిద్ధం చేయాలని పవన్ కళ్యాణ్ ఆదేశించారని వివరించారు. సాంకేతిక పరిజ్ఞానాన్ని ఉపయోగించి భక్తుల రద్దీని క్రమబద్ధీకరించనున్నట్లు మంత్రి దుర్గేష్ వెల్లడించారు. అదేవిధంగా నిడదవోలు నియోజకవర్గంలో గ్రామీణ అభివద్ధి, పంచాయితీ రాజ్ శాఖ ద్వారా పలు పనులు చేపట్టినట్లు, వాటి పురోగతిని డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ కు వివరించినట్లు మంత్రి దుర్గేష్ ఈ సందర్భంగా తెలిపారు. ఈ క్రమంలో నిడదవోలు అభివద్ధికి సహకరిస్తున్నందుకు డిప్యూటీ సీఎం కి మంత్రి దుర్గేష్ ధన్యవాదాలు తెలిపారు.

# అంబేద్కర్ ప్రస్తావన లేకుండా ముఖ్యమంత్రి చంద్రబాబు ప్రసంగం ఉండదు

**ఆయన ఆశయాలకనుగుణంగానే మా ప్రభుత్వ పాలన ఉంటుంది**
**అంబేద్కర్ జయంతి సందర్భంగా ఎమ్మెల్యే పరిటాల సునీత**
**నసనకోటలో అంబేద్కర్ కు ఘన నివాళులు**
**అర్పించిన ఎమ్మెల్యే సునీత**
**జగన్ పాలనలో రాజారెడ్డి రాజ్యాంగం**
**మాత్రమే కనిపించిందన్న సునీత**



**రామగిరి ఏప్రిల్ 14: బహుజన వేదిక న్యూస్**

డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ గురించి ప్రస్తావన లేకుండా ముఖ్యమంత్రి చంద్రబాబు ప్రసంగం ఎక్కడా ఉండదని రాప్తాడు ఎమ్మెల్యే పరిటాల సునీత అన్నారు. అంబేద్కర్ 135వ జయంతి కార్యక్రమాన్ని రాప్తాడు నియోజకవర్గ వ్యాప్తంగా టిడిపి శ్రేణులు ఘనంగా నిర్వహించారు. రామగిరి మండలం నసనకోట పంచాయతీ కేంద్రంలో జరిగిన వేడుకల్లో ఎమ్మెల్యే పరిటాల సునీత పాల్గొన్నారు. అంబేద్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళు లర్పించారు. ఈ కార్యక్రమంలో టిడిపి నాయకులు, కార్యకర్తలు, పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. అంబేద్కర్ విగ్రహం వద్ద అందమైన ముగ్గులు వేసి ఒక పండుగ వాతావరణం తలపించేలా చేసిన మహిళలను ఆమె ప్రత్యేకంగా అభినందించారు. ముగ్గులతో అందర్నీ ఆకర్షించిన మహిళలకు చీరలు బహుకరించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే పరిటాల సునీత మాట్లాడుతూ ఈరోజు ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీలకు అన్ని వర్గాల్లో సముచిత స్థానం దక్కుతోందంటే అది ఒక్క అంబేద్కర్ రాసిన రాజ్యాంగం వల్లనేనన్నారు. ఒక పేద కుటుంబంలో పుట్టిన ఆయన దేశానికే దిక్సూచిగా మారారన్నారు. చంద్రబాబు రాజకీయాల్లోకి వచ్చిన నాటి నుంచి అంబేద్కర్ ఆశయాలకు అనుగుణంగా ముందుకు వెళ్తున్నారన్నారు. ముఖ్యమంత్రి అయిన రోజు నుంచి ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీలకు తగిన ప్రాధాన్యత కల్పించారన్నారు. కూటమి ప్రభుత్వం పాలనలో కూడా చాలామంది ఎస్సీ, ఎస్టీలకు సముచిత స్థానం కల్పించారన్నారు. అంబేద్కర్ స్ఫూర్తితోనే ఈ ప్రభుత్వ పాలన సాగుతోందన్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబు ఏ సమావేశం జరిగినా.. అంబేద్కర్ గురించి మాట్లాడకుండా అది పూర్తి కాదన్నారు. గత ఐదేళ్ల వైసిపి పాలనలో అంబేద్కర్ రాజ్యాంగాన్ని పక్కన పెట్టి రాజారెడ్డి రాజ్యాంగాన్ని అమలు చేశారని విమర్శలు చేశారు. ఎంతోమంది ఎస్సీ, ఎస్టీలపై దాడులు జరిగాయని హత్యలు జరిగినా ఏ రోజు గత ప్రభుత్వంలో పట్టించుకోలేదన్నారు. అందుకే ఆ ప్రభుత్వాన్ని 11 స్థానాలకు పరిమితం చేసి మరోసారి చంద్రబాబును ముఖ్యమంత్రిగా చేసుకున్నారన్నారు. ఈ ప్రభుత్వంలో అన్ని వర్గాలకు న్యాయం చేయడమే లక్ష్యంగా పనిచేస్తున్నామని ఎమ్మెల్యే స్పష్టం చేశారు...

### ఎమ్మెల్యే పరిటాల సునీతను కలిసిన రూరల్ డిఎస్పి టి.శ్రీనివాసులు

అనంతపురం డిఎస్పీగా నూతనంగా బాధ్యతలు చేపట్టిన టి శ్రీనివాసులు రాప్తాడు ఎమ్మెల్యే పరిటాల సునీతను మర్యాదపూర్వకంగా కలిశారు. రామగిరి మండలం వెంకటాపురంలోని ఆమె నివాసానికి డిఎస్పి వచ్చారు. డీఎస్పీగా బాధ్యతలు చేపట్టిన శ్రీనివాసులుకు ఎమ్మెల్యే సునీత శుభాకాంక్షలు తెలియజేశారు. రాప్తాడు నియోజకవర్గ పరిధిలోని మండలాల్లో పరిస్థితి గురించి ఇరువురు చర్చించుకున్నారు. ప్రస్తుతమున్న శాంతిభద్రతలతో పాటు గతంలో జరిగిన కొన్ని పరిణామాల గురించి చర్చించారు. నియోజకవర్గంలో ప్రశాంతంగా వాతావరణం ఉండాలని ఇందుకు తమవంతుగా సహకారం ఉంటుందని ఎమ్మెల్యే పరిటాల సునీత అన్నారు

# ఘనంగా డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ జయంతి

**బద్వేలు, ఏప్రిల్ 14: బహుజన వేదిక న్యూస్**

భారతరత్న డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ 135 వ జయంతి ఉత్సవాలు వైఎస్ఆర్సిపి ఆధ్వర్యంలో కడపలో మంగళవారం ఘనంగా నిర్వహించారు. వైఎస్ఆర్సిపి ఎస్సీ సెల్ అధ్యక్షులు సింగమాల వెంకటేశ్వర్లు ఆధ్వర్యంలో కడప పట్టణంలో జయంతి వేడుకలు ఘనంగా జరిగాయి.

మొదటగా కడప నడిబొడ్డున ఉన్న డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ విగ్రహానికి పూలమాలలు వైఎస్ఆర్సిపి జిల్లా అధ్యక్షులు రవీంద్రనాథ్ రెడ్డి , మాజీ ఉపముఖ్యమంత్రి అంజాద్ బాషా , వైఎస్ఆర్సిపి సీఈసీ మెంబర్ సురేష్ బాబు వేసి స్మరించుకోవడం, ఆ తర్వాత వైఎస్ఆర్ సిపి పార్టీ కార్యాలయంలో డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ చిత్రపటానికి, దివంగత ముఖ్యమంత్రి డాక్టర్ వైయస్ రాజశేఖర్ రెడ్డి విగ్రహానికి పూలమాలలు వేసి స్మరించుకున్నారు.

తర్వాత భోజన సదుపాయాలు అందరికీ వితరణ చేయడం జరిగింది. ప్రెస్ మీట్ లో మాట్లాడుతూ శ్రీ వైయస్ జగన్మోహన్ రెడ్డి ఐదేళ్ల కాలంలో రెండు సంవత్సరాలు కరోనా ఉన్నప్పటికీ ఎస్సీలకు బీసీలకు ఎస్టీలకు మైనార్టీలకు చేసిన మేలు ఈ కూటమి ప్రభుత్వం వచ్చిన తర్వాత ఎంత ఘోరంగా ఉందో మనకు ఇప్పుడు కండ్ల కు కట్టినట్టు ఉంది. డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ విగ్రహాన్ని విజయవాడ నడి బొడ్డున 200 అడుగులు పైన విగ్రహాన్ని నిర్మించడం జరిగింది. ఈరోజు ఆ విగ్రహం దగ్గర చూస్తే గాలికి వదిలేసి ఎవరూ పట్టించుకోకుండా ఉన్నారు. ఒక్క జగన్మోహన్ రెడ్డి మాత్రమే పేదల పక్షాన మరియు ముఖ్యంగా తన మేనిఫెస్టోలో ప్రకటించిన అన్ని వాగ్దానాలను 99% నెరవేర్చారు అని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో వైఎస్ఆర్సిపి అగ్ర నాయకులు, మహిళలు మరియు కార్యకర్తలు కార్యకర్తలు వంద మందికి పైగా పాల్గొన్నారు.





# డాక్టర్ బిఆర్ అంబేద్కర్ ఆశయాల సాధనకు ప్రతి ఒక్కరు కృషి చేయాలి

**---అంబేద్కర్ చూపిన దారిలోనే దేశ భవిష్యత్ నిర్మాణం.**
**---ఆశయాల అమలే నిజమైన ఘన నివాళి.**
**---జిల్లా కలెక్టర్ దివాకర టి.ఎస్.**



**ములుగు :** డాక్టర్ బి ఆర్ అంబేద్కర్ ఆశయాల కృషికి ప్రతి ఒక్కరు కృషి చేయాలని ఆయన చూపిన దారిలోనే ప్రజాస్వామ్య భవిష్యత్తు నిర్మాణమైనదని,మహోన్నత వ్యక్తుల ఆశయాలను అమలు చేయడమే,నిజమైన ఘన నివాళి అని జిల్లా కలెక్టర్ దివాకర టిఎస్ తెలిపారు. మంగళవారం భారత రాజ్యాంగ నిర్మాత భారతరత్న డాక్టర్ బిఆర్ అంబేద్కర్ 135వ జయంతి ఉత్సవాల సందర్భంగా ములుగు జిల్లా కేంద్రంలో బస్టాండ్ కూడలి వద్ద ఉన్న డా బాబా సాహెబ్ అంబేద్కర్ విగ్రహానికి జిల్లా కలెక్టర్ దివాకర్ టిఎస్ పూలమాలవేసి ఘనంగా నివాళు లర్పించారు. అనంతరం షెడ్యూల్ కులాల అభివృద్ధి శాఖ ఆధ్వర్యంలో జిల్లా కలెక్టరేట్ సమావేశం మందిరంలో డాక్టర్ బిఆర్ అంబేద్కర్ 135వ జయంతి ఉత్సవాల కార్యక్రమాలను అంగరంగ వైభవంగా నిర్వహిం చారు. ఈ కార్యక్రమానికి జిల్లా కలెక్టర్ ముఖ్య అతిథిగా హాజరై సభాస్థలి సమావేశం మందిరంలో ఏర్పాటుచేసిన భారత రాజ్యాంగ నిర్మాత,భారతరత్న డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ చిత్రపటానికి పూలమాల ఘటించి జ్యోతి ప్రజ్వనలతో ఉత్సవాలను ప్రారంభించారు.ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ దివాకర టిఎస్.మాట్లాడుతూ భారతరత్న డాక్టర్ బిఆర్ అంబేద్కర్ దేశానికి చేసిన సేవలు, రాజ్యాంగ నిర్మాణానికి చేసిన కృషి మరువలేనివని,అంబేద్కర్ ఘన కీర్తి ప్రపంచ నలుమూలల వ్యాప్తి చెందడంతో పాటు ప్రపంచానికే మార్గదర్శిగా నిలిచారని కొనియాడారు. డాక్టర్ అంబేద్కర్ దేశానికి చేసిన సేవలు, సామాజిక న్యాయం కోసం చేసిన అసాధారణ కృషి చిరస్మరణీయమైనవని, సమానత్వం, స్వాతంత్ర్యం, సౌభ్రాతృత్వం అనే రాజ్యాంగ విలువలను ప్రతి పౌరుడూ జీవితంలో ఆచరించాలని పిలుపునిచ్చారు.చదువు, సమీకరించు, పోరాడు అనే నినాదాలతో యువత ముందుకు రావాలని, జ్ఞానం లేని పోరాటం దిశ లేని ప్రయాణం వంటిదని అంబేద్కర్ విశ్వసించేవారని వారి బాటలోనే యువత జ్ఞానాన్ని సంపాదించుకోవాలని సూచించారు. అంబేద్కర్ ఆలోచనలు, ఆయన చూపిన మార్గం యువతకు శాశ్వత ఆదర్శంగా నిలుస్తున్నాయని, విద్య మాత్రమే సామాజిక మార్పు సాధ్యం చేస్తుందని,అన్ని వర్గాల ప్రజ అభివృద్ధికి ఆయన చేసిన సేవలు ఎప్పటికీ మరచిపోలేనివి కొనియాడారు.

## సీనియర్ పాత్రికేయులు కాలువ రమణ కుటుంబానికి ఎమ్మెల్యే అమిలినేని సురేంద్ర బాబు చేయూత




**రూ. లక్ష ఆర్థిక సాయం, భవిష్యత్తులో అండగా ఉంటానని హామీ**

**కళ్యాణదుర్గం ఏప్రిల్ 14: బహుజన వేదిక న్యూస్**

ఇటీవల అనారోగ్యంతో మృతి చెందిన సీనియర్ జర్నలిస్టు కాలువ రమణ కుటుంబానికి ఎమ్మెల్యే తనవంతు ఆర్థిక సాయం చేశారు. గతం లో ప్రకటించిన విధంగా రమణ కుటుంబ సభ్యులకు తన క్యాంప్ కార్యాలయంలో రూ.లక్ష నగదు అందజేశారు. ఈ సందర్బంగా రమణ భార్య కాలువ రాజేశ్వరి, కూతురు కాలువ జాహ్నవి ను అడిగి వారి పరిస్థితి ని తెలుసుకున్నారు. భవిష్యత్తు లో ఏ అవసరం వచ్చిన తనవంతు సహాయం చేస్తానని భరోసా ఇచ్చారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే కు రమణ భార్య, కూతురు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో వార్త బ్యూరో భోగేశ్వర్ రెడ్డి, టీవీ5 సీనియర్ కరెస్పాండెంట్ గుడిపుటి చంద్రశేఖర్, ఏబీఎన్ బ్యూరో సురేష్, ప్రెస్ క్లబ్ ఆడహక్ కమిటీ అధ్యక్షుడు పయ్యావుల ప్రవీణ్,శ్రీరామ్ తదితరులు పాల్గొన్నారు... ఈ సందర్భంగా ఆర్థిక సహాయం చేసినందుకు సీనియర్ జర్నలిస్టు దివంగత కాలవ రవణ సతీమణి రాజేశ్వరి, కూతురు జాహ్నవి ప్రత్యేకంగా ఎమ్మెల్యే సురేంద్ర బాబు కి కృతజ్ఞతలు తెలియజేశారు.

## అంబేద్కర్ జయంతి సందర్భంగా విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించిన మంత్రి సత్యకుమార్ యాదవ్



**అంబేద్కర్ ఆశయాలే సమాజానికి మార్గదర్శకం -- మంత్రి సత్యకుమార్ యాదవ్**
**రాజ్యాంగ విలువల పరిరక్షణ ప్రతి ఒక్కరి బాధ్యత:-- మంత్రి సత్యకుమార్ యాదవ్**

**ధర్మవరం, ఏప్రిల్ 14:బహుజన వేదిక న్యూస్**

ధర్మవరం పట్టణంలోని కళాజ్యోతి సర్కిల్ వద్ద ఉన్న అంబేద్కర్ విగ్రహానికి రాష్ట్ర వైద్య, ఆరోగ్య, కుటుంబ సంక్షేమ మరియు వైద్య విద్య శాఖామాత్యులు, ధర్మవరం శాసనసభ్యులు సత్యకుమార్ యాదవ్ పూలమాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా మంత్రి సత్యకుమార్ యాదవ్ మాట్లాడుతూ... భారత రాజ్యాంగ శిల్పి డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ గారు జీవితాంతం సామాజిక న్యాయం, సమానత్వం, మానవ హక్కుల కోసం నిరంతరం పోరాడిన మహానుభావుడని కొనియాడారు. సమాజంలోని అణగారిన వర్గాలకు గౌరవప్రదమైన జీవనం కల్పించాలనే దృఢ సంకల్పంతో ఆయన చేసిన కృషి అపారమని పేర్కొన్నారు. అంబేద్కర్ గారి ఆశయాలు నేటి సమాజానికి మార్గదర్శకంగా నిలుస్తున్నాయని, ప్రతి ఒక్కరూ ఆయన చూపిన మార్గాన్ని అనుసరించి సమాన హక్కులు అందరికీ చేరేలా కృషి చేయాలని మంత్రి పిలుపునిచ్చారు. రాజ్యాంగ విలువలను పరిరక్షించడం ప్రతి పౌరుడి బాధ్యతగా భావించాలన్నారు. అలాగే, సమానత్వం, స్వేచ్ఛ, సోదరభావం అనే విలువలు సమాజంలో బలపడినప్పుడే దేశం నిజమైన అభివృద్ధి సాధిస్తుందని తెలిపారు. అంబేద్కర్ గారి ఆలోచనలు, సిద్ధాంతాలు ప్రతి తరానికి స్ఫూర్తినిచ్చేలా ఉంటాయని పేర్కొన్నారు.

## భారత రాజ్యాంగ నిర్మాత శ్రీ డాక్టర్ బీ.ఆర్. అంబేద్కర్ గారి ఆశయాలు స్ఫూర్తిగా తీసుకుందాం

**జిల్లా ఎస్పీ పి.జగదీష్ ఐపిఎస్**
**డాక్టర్ బీ.ఆర్. అంబేద్కర్ గారి**
**చిత్రపటానికి పూలమాల వేసి నివాళులు**
**అర్పించిన జిల్లా ఎస్పీ**





**అనంతపురము ఏప్రిల్ 14: బహుజన వేదిక న్యూస్**

భారత రాజ్యాంగ నిర్మాత, భారత రత్న డాక్టర్ శ్రీ బీ.ఆర్. అంబేద్కర్ జయంతి సందర్భంగా అనంతపురం జిల్లా పోలీసు కార్యాలయంలో ఘనంగా నివాళులు అర్పించారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఎస్.పి శ్రీ పి. జగదీష్, ఐపీఎస్ పాల్గొని డాక్టర్ బీ.ఆర్. అంబేద్కర్ గారి చిత్రపటానికి పూలమాల వేసి స్మరించారు. ఈ సందర్భంగా ఎస్.పి మాట్లాడుతూ, అంబేద్కర్ గారు దేశానికి చేసిన సేవలు అపారమని కొనియాడారు. సమానత్వం, సామాజిక న్యాయం, ప్రజాస్వామ్య విలువలకు పునాది వేసిన మహనీయుడు అని పేర్కొన్నారు. ఆయన చూపిన మార్గం ప్రతి ఒక్కరికీ స్ఫూర్తిదాయకమని అన్నారు. అంబేద్కర్ గారి ఆశయాలను అనుసరిస్తూ సమాజంలో సమానత్వం నెలకొల్పేందుకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని పిలుపునిచ్చారు. విధుల్లో నిబద్ధతతో పనిచేస్తూ ప్రజలకు మెరుగైన సేవలు అందించాలని పోలీసు సిబ్బందిని సూచించారు. ఈ కార్యక్రమంలో ఏ.ఆర్ అదనపు ఎస్పీ ఇలియాస్ బాషా, ఆర్ ఐ లు పవన్ కుమార్ , రాముడు, జిల్లా పోలీసు అధికారుల సంఘం అడహక్ కమిటీ సభ్యులు సాకే త్రిలోక్ నాథ్ , గాండ్ల హరినాథ్ , లక్ష్మీనారాయణ, ఆర్ ఎస్ ఐ లు బాబ్జాన్, సురేష్ రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

# అందరివాడు అంబేద్కర్






**హనుమకొండ :** కాకతీయ విశ్వవిద్యాలయంలో డాక్టర్ బాబాసాహెబ్ అంబేద్కర్ 136వ జయంతి ఘనంగా నిర్వహించబడింది. విశ్వవిద్యాలయ సెనెట్ హాల్‌లో జరిగిన ఈ కార్యక్రమానికి వైస్ ఛాన్సలర్ ఆచార్య కె. ప్రతాప్ రెడ్డి ముఖ్య అతిథిగా హాజరై, అంబేద్కర్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, "అందరివాడు అంబేద్కర్" అని పేర్కొన్నారు. అంబేద్కర్ గొప్ప ఆలోచనాపరుడు, మార్గదర్శి, బహుముఖ ప్రజ్ఞాశాలి అని కొనియాడుతూ, భారత జాతీయ సంస్థల నిర్మాణంలో ఆయన ఆలోచనలకు కీలక స్థానం ఉందన్నారు. సమాజానికి ఆయన చేసిన నిస్వార్థ సేవలను ప్రతి ఒక్కరూ గుర్తుంచుకుని కృతజ్ఞతాభావంతో ఉండాలని, స్వార్థాన్ని విడనాడాలని సూచించారు. కాకతీయ విశ్వవిద్యాలయం ఉత్తమ విద్యాసంస్థగా నిలుస్తుందని, ఇక్కడ విద్యార్థులు అన్ని విధాలుగా అభివృద్ధి చెందే అవకాశాలు ఉన్నాయని తెలిపారు. విశ్వవిద్యాలయ అభివృద్ధికి అందరూ సహకరించాలని, జాతీయ స్థాయిలో విశ్వవిద్యాలయాన్ని మరింత ఉన్నత స్థానానికి తీసుకెళ్లాలని పిలుపునిచ్చారు. అంబేద్కర్ అధ్యయన కేంద్రాన్ని బలోపేతం చేయడానికి నిధులను పెంచుతామని తెలిపారు. ఈ కార్యక్రమంలో వరంగల్ ఎన్ఐటీ ఆచార్యులు ఆచార్య ఆనంద కిషోర్ కోలా మాట్లాడుతూ, డాక్టర్ బాబాసాహెబ్ అంబేద్కర్ ఒక మార్పును సృష్టించి ఇతరులను ప్రేరేపించే నాయకుడు అని అభివర్ణించారు. వివక్షలను ఎదుర్కొన్నప్పటికీ ప్రతి పరిస్థితిని సానుకూలంగా స్వీకరించి విజయాన్ని సాధించిన మహనీయుడని తెలిపారు. పీడిత, నిరుత్సాహిత, అణచివేయబడిన వర్గాల కోసం అంబేద్కర్ నిరంతరం పోరాడారని, అవమానాలు మరియు అసమానతలను విద్య ద్వారానే తొలగించవచ్చని ఆయన విశ్వసించారని పేర్కొన్నారు. విదేశీ విద్యను అభ్యసించినప్పటికీ దేశ అభ్యున్నతి కోసం స్వదేశానికి తిరిగి వచ్చారని తెలిపారు. ఆయన భారతదేశానికి దిక్సూచి లాంటివారని, తన శక్తి, సామర్థ్యాలతో దేశ దిశ, దశలను మార్చారని అన్నారు. ఉపాధ్యాయ వృత్తి గొప్పదని, పరిశోధకులు కొత్త అంశాలపై పరిశోధనలు చేయాలని సూచించారు. ప్రతి పనిలో పరిపూర్ణత ఉండాలని, చట్టం ముందు అందరూ సమానమని చెప్పారు. సమాజానికి సేవ చేయడం ప్రతి మేధావి బాధ్యత అని తెలిపారు. బలహీన వర్గాల బలోపేతానికి విద్యే ప్రధాన మార్గమని అన్నారు. రిజిస్ట్రార్ ఆచార్య వి. రామచంద్రం మాట్లాడుతూ అంబేద్కర్ అన్ని వర్గాల ప్రజలకు ఆదర్శప్రాయుడని, నేటి స్వేచ్ఛ ఆయన కృషి ఫలితమని పేర్కొన్నారు. ఆఫీసర్ ఆన్ స్పెషల్ డ్యూటీ ఆచార్య బి. వెంకట్రామరెడ్డి అంబేద్కర్ గొప్ప దేశభక్తుడని, ఆయన ఆశయాలను యువత కొనసాగించాలని అన్నారు. సభాధ్యక్షులు డాక్టర్ ఎ. రాజు మాట్లాడుతూ విశ్వవిద్యాలయ ఎస్ సి/ఎస్ టి సెల్ సమర్థవంతంగా పనిచేస్తూ విద్యార్థులు, ఉద్యోగుల ప్రయోజనాలను కాపాడుతోందని తెలిపారు. ఎస్ సి/ఎస్ టి ఉద్యోగ సంఘ కార్యదర్శి డాక్టర్ పుల్ల శ్రీనివాస్, సంఘ అధ్యక్షులు ఆచార్య ఈసం నారాయణ మహానుభావులను గౌరవించాలని, నిధులను సమర్థంగా వినియోగించాలన్నారు. పాలక మండలి సభ్యులు ఆచార్య సురేష్ లాల్ అంబేద్కర్ గొప్ప ఆర్థిక శాస్త్రవేత్త అని, ద్వేషానికి స్థానం లేదని అన్నారు. కే. అనితా రెడ్డి ప్రతి మనిషిని గౌరవించాల్సిన అవసరం ఉందని, స్వాభిమానానికి ప్రాధాన్యం ఇవ్వాలని పేర్కొన్నారు. డాక్టర్ రమ యువత మనసును అభివృద్ధి చేసుకోవాలని, మంచి ఆలోచనలు పెంపొందించుకోవాలని సూచించారు. కార్యక్రమంలో బోధనా, బోధనేతర సిబ్బంది, పరిశోధకులు, విద్యార్థులు పాల్గొన్నారు. కార్యక్రమానికి ముందు ఆడిటోరియం ప్రాంగణంలోని అంబేద్కర్ విగ్రహానికి వైస్ ఛాన్సలర్, రిజిస్ట్రార్ మరియు ఇతర అధికారులు పూలమాలలు వేసి నివాళులు అర్పించారు..

# అంబేద్కర్ ఆశయాల సాధనకు సమాజం ముందుకు రావాలి


**దళిత, బడుగు బలహీన వర్గాల అభ్యున్నతే నిజమైన నివాళి**

**పి. రామాంజనేయప్రసాద్**

**బహుజన వేదిక తెలుగు జాతీయ దినపత్రిక ఎడిటర్ & ఆల్ ఇండియా ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ వర్కింగ్ జర్నలిస్ట్ ఐక్యవేదిక అధ్యక్షులు**

**అనంతపురము, ఏప్రిల్ 14: బహుజన వేదిక న్యూస్**





భారత రాజ్యాంగ రూపకర్త డా. బి.ఆర్. అంబేద్కర్ గారి 135వ జయంతి సందర్భంగా ఆంధ్రప్రదేశ్ రాష్ట్రవ్యాప్తంగా ఘనంగా నివాళులర్పణ కార్యక్రమాలు నిర్వహించబడ్డాయి. రాష్ట్రంలోని పలు జిల్లాల్లో ప్రజా ప్రతినిధులు, సామాజిక సంస్థలు, విద్యాసంస్థలు, యువజన సంఘాలు, కార్మిక సంఘాలు విస్తృతంగా పాల్గొని అంబేద్కర్ గారి సేవలను స్మరించాయి. ముఖ్యంగా అనంతపురం జిల్లాలో నిర్వహించిన కార్యక్రమాలు విశేష ప్రాధాన్యం సంతరించుకొని సామాజిక చైతన్యానికి వేదికగా నిలిచాయి. జిల్లా కేంద్రం నుండి గ్రామీణ ప్రాంతాల వరకు అంబేద్కర్ గారి ఆశయాలపై అవగాహన కల్పించే ర్యాలీలు, సభలు, చర్చా కార్యక్రమాలు నిర్వహించడం ద్వారా సమానత్వం, సామాజిక న్యాయం పట్ల ప్రజల్లో స్పష్టమైన చైతన్యం నెలకొల్పే ప్రయత్నం బహుజన వేదిక తెలుగు జాతీయ దినపత్రిక ఆధ్వర్యంలో జరిగింది.

అనంతపురం పట్టణంలోని జిల్లా పరిషత్ కార్యాలయం ఎదుట ఉన్న అంబేద్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ కార్యక్రమానికి బహుజన వేదిక తెలుగు జాతీయ దినపత్రిక ఎడిటర్ మరియు ఆల్ ఇండియా ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ వర్కింగ్ జర్నలిస్ట్ ఐక్యవేదిక అధ్యక్షులు పి. రామాంజనేయప్రసాద్ ముఖ్య అతిథిగా హాజరై కార్యక్రమాన్ని ముందుండి నడిపించారు. ఈ సందర్భంగా ఆయన అంబేద్కర్ గారి జీవితం, ఆశయాలు, రాజ్యాంగ నిర్మాణంలో ఆయన పాత్రపై విస్తృతంగా ప్రసంగించారు. కార్యక్రమానికి పెద్ద సంఖ్యలో ప్రజలు, యువత, మహిళలు, విద్యార్థులు పాల్గొని అంబేద్కర్ గారి ఆశయాలను కొనసాగించాలనే సంకల్పాన్ని వ్యక్తం చేశారు. పి. రామాంజనేయప్రసాద్ మాట్లాడుతూ, "భారత రాజ్యాంగ రూపకల్పనలో డా. బి.ఆర్. అంబేద్కర్ గారు చేసిన అపూర్వ కృషి దేశ ప్రజలందరికీ సమాన హక్కులు కల్పించింది. ముఖ్యంగా దళితులు, బడుగు బలహీన వర్గాల సాధికారతకు బలమైన పునాది వేసింది. అయితే ప్రస్తుత సమాజంలో ఈ వర్గాలు ఇంకా అనేక సమస్యలను ఎదుర్కొంటున్నాయి. రాజ్యాంగంలో హక్కులు ఉన్నప్పటికీ వాటి అమలు విషయంలో లోపాలు స్పష్టంగా కనిపిస్తున్నాయి. సామాజిక అసమానతలు పూర్తిగా తొలగిపోలేదు" అని పేర్కొన్నారు. ఆయన మరింతగా మాట్లాడుతూ, "సమాజంలో నిజమైన మార్పు రావాలంటే అంబేద్కర్ గారి ఆశయాలను కేవలం జయంతి వేడుకలకే పరిమితం చేయకుండా ప్రతి ఒక్కరూ ఆచరణలో పెట్టాలని. దళితులు, పేదలు, బడుగు బలహీన వర్గాల జీవన విధానం మెరుగుపడేందుకు ప్రభుత్వాలు మాత్రమే కాదు, సమాజం మొత్తం బాధ్యత తీసుకోవాలి. విద్య, ఉపాధి, ఆరోగ్యం, భూహక్కులు, సామాజిక గౌరవం వంటి అంశాల్లో సమానత్వం సాధించినప్పుడే అంబేద్కర్ గారికి నిజమైన నివాళి అర్పించినట్టవుతుంది" అని పి రామాంజనేయ ప్రసాద్ స్పష్టం చేశారు. ఇదే సందర్భంగా అనంతపురం జిల్లా కనగానపల్లి మండలం మద్దెలచెరువు గ్రామంలోని ఎస్సీ కాలనీలో అంబేద్కర్ జయంతి వేడుకలు అత్యంత ఘనంగా నిర్వహించబడ్డాయి. ఈ కార్యక్రమానికి పి. రామాంజనేయప్రసాద్ ముఖ్య అతిథిగా హాజరై డా. బి.ఆర్. అంబేద్కర్ గారి విగ్రహంతో పాటు ఫాదర్ విన్సెంట్ ఫెర్రర్ గారి విగ్రహాలను ఆవిష్కరణ కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా గ్రామ ప్రజలు పెద్ద ఎత్తున పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేశారు. విగ్రహావిష్కరణ అనంతరం జరిగిన సభలో పి. రామాంజనేయప్రసాద్ మాట్లాడుతూ, అంబేద్కర్ గారు అణగారిన వర్గాల ఆత్మగౌరవానికి ప్రతీకగా నిలిచారని, వారి హక్కుల సాధన కోసం జీవితాంతం పోరాడిన మహానేత అని కొనియాడారు. ఆయన చూపిన మార్గం సమానత్వ సమాజ నిర్మాణానికి పునాది అని పేర్కొన్నారు. అదే విధంగా ఫాదర్ విన్సెంట్ ఫెర్రర్ గారు గ్రామీణాభివృద్ధి, పేదల సంక్షేమం కోసం చేసిన సేవలు చిరస్మరణీయమని, ఆయన సేవా తత్వం సమాజానికి ఆదర్శంగా నిలుస్తుందని తెలిపారు. గ్రామీణ ప్రాంతాల్లో విద్య, ఆరోగ్యం, ఉపాధి రంగాల్లో ఆయన చేసిన కృషి లక్షలాది కుటుంబాల జీవితాలను మార్చిందని ఆయన వివరించారు. మద్దెలచెరువు గ్రామంలోని ఎస్సీ కాలనీలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో స్థానిక ప్రజలు, యువత, మహిళలు విశేషంగా పాల్గొని అంబేద్కర్ గారి ఆశయాలపై చర్చలు జరిపారు. గ్రామస్థులు సమాజంలో ఇంకా కొనసాగుతున్న అసమానతలు, వివక్షలను నిర్మూలించేందుకు సంకల్పం వ్యక్తం చేశారు. అంబేద్కర్ గారి బాటలో నడవాలని, విద్య, చైతన్యం, సంఘటిత పోరాటం ద్వారానే అభ్యున్నతి సాధ్యమని నాయకులు సూచించారు. జిల్లా వ్యాప్తంగా బహుజన వేదిక తెలుగు జాతీయ దినపత్రిక ఆధ్వర్యంలో పలు విద్యాసంస్థల్లో అంబేద్కర్ జయంతి సందర్భంగా వ్యాసరచన, వక్తృత్వ పోటీలు, అవగాహన సదస్సులు, ర్యాలీలు నిర్వహించబడ్డాయి. విద్యార్థుల్లో అంబేద్కర్ గారి ఆలోచనలపై అవగాహన పెంపొందించేందుకు ప్రత్యేక కార్యక్రమాలు చేపట్టారు. గ్రామీణ ప్రాంతాల్లో కూడా బహుజన వేదిక ఆధ్వర్యంలో చైతన్య యాత్రలు నిర్వహించి అంబేద్కర్ గారి జీవితం, తత్వం ప్రజల్లోకి తీసుకెళ్లారు. కార్యక్రమాల్లో పాల్గొన్న ప్రజలు "జై భీమ్", "జై అంబేద్కర్", "జై భారత్" నినాదాలతో ఉత్సాహంగా పాల్గొని అంబేద్కర్ ఆశయాలను కొనసాగించేందుకు సంకల్పం వ్యక్తం చేశారు. సమాజంలో సమానత్వం, సామాజిక న్యాయం స్థాపించడమే ఆయనకు నిజమైన నివాళి అని పలువురు అభిప్రాయపడ్డారు. కార్యక్రమాల ముగింపులో పి. రామాంజనేయప్రసాద్ ప్రతి ఒక్కరూ అంబేద్కర్ గారి బాటలో నడిచి సామాజిక న్యాయం, సమాన హక్కుల సాధనకు కృషి చేయాలని పిలుపునిచ్చారు. దళితులు, బడుగు బలహీన వర్గాల అభ్యున్నతే సమాజ అభివృద్ధికి అసలైన మార్గమని స్పష్టం చేశారు. రాష్ట్రంలో అణగారిన వర్గాల సంక్షేమం కోసం ప్రభుత్వం మరింత కట్టుబడి పని చేయాల్సిన అవసరం ఉందని కూడా ఈ సందర్భంగా సూచించారు.

## జనగణన-2027లో భాగంగా ఏప్రిల్ 16 నుండి 30 వరకు 'స్వీయగణన' (Self-Enumeration) కార్యక్రమం



**జిల్లా ప్రిన్సిపాల్ సెన్సస్ అధికారి మరియు జిల్లా కలెక్టర్ ఓ. ఆనంద్**

**అనంతపురము, ఏప్రిల్14: బహుజన వేదిక న్యూస్**

భారత ప్రభుత్వ హోం వ్యవహారాల మంత్రిత్వ శాఖ మరియు ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు, జనగణన-2027 ప్రక్రియలో భాగంగా జిల్లాలో మొదటిసారిగా 'స్వీయ గణన' (Self-Enumeration) కార్యక్రమం నిర్వహణ ఉంటుందని జిల్లా కలెక్టర్ మరియు ప్రిన్సిపల్ సెన్సస్ ఆఫీసర్ ఓ. ఆనంద్ ఒక ప్రకటనలో తెలిపారు. ప్రజలు తమ వివరాలను తామే స్వయంగా ఆన్‌లైన్ పోర్టల్ (https://se.census.gov.in) ద్వారా నమోదు చేసుకునేందుకు వీలుగా ఏప్రిల్ 16 నుండి ఏప్రిల్ 30 వరకు 15 రోజుల పాటు ప్రత్యేక అవగాహన ప్రచార కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ సందర్భంగా కలెక్టర్ గారు అధికారులకు మరియు ప్రజలకు పలు సూచనలు చేస్తూ పదిహేను రోజుల ప్రచార షెడ్యూల్ వివరాలు తెలిపారు. షెడ్యూల్ మేరకు ఏప్రిల్ 16న గౌరవనీయులైన మంత్రులు, ఎమ్మెల్యేలు మరియు పంచాయతీ రాజ్ ప్రతినిధుల గణనతో ప్రారంభమవుతుందనీ అన్నారు. 17వ తేదీన సచివాలయ సిబ్బంది, జిల్లా కలెక్టరేట్ మరియు ఇతర శాఖాధిపతుల కార్యాలయ సిబ్బంది తమ వివరాలను నమోదు చేసుకోవాలని సూచించారు 18న పద్మ అవార్డు గ్రహీతలు, క్రీడాకారులు మరియు కళాకారుల వంటి ప్రముఖ వ్యక్తులు స్వీయగణన 19న డ్వాక్రా మరియు స్వయం సహాయక సంఘాల సభ్యులకు 20న ఉపాధి హామీ పథకం కూలీలకు మొదటి విడతగా అవగాహన కల్పిస్తారు. 21వ తేదీన జిల్లాలోని అన్ని శాఖల ప్రభుత్వ ఉద్యోగులు 22న కళాశాల మరియు విశ్వవిద్యాలయ విద్యార్థులు ఈ ప్రక్రియలో పాల్గొంటారు. ఏప్రిల్ 23న అంగన్‌వాడీ కేంద్రాల ద్వారా గర్భిణీలు, ఆశా వర్కర్లు మరియు చాచీవీ లు నమోదు. 24న గిరిజన ప్రాంతాలు మరియు వారపు సంతల వద్ద 25న పట్టణ ప్రాంతాల్లోని రెసిడెంట్ వెల్ఫేర్ అసోసియేషన్లు మరియు వృద్ధాశ్రమాలలో స్వీయ గణన. 26వ తేదీన ప్రజల్లో అవగాహన కోసం జిల్లా కేంద్రంలో 'సెన్సస్ 5ఖ రన్' నిర్వహణ ఉంటుంది. 27న పరిశ్రమలు, బ్యాంకులు మరియు ప్రైవేటు సంస్థల సిబ్బంది 28న డ్వాక్రా సంఘాలకు రెండవ విడతగా 29న పోలీస్ సిబ్బందికి మరియు ముగింపు రోజైన 30వ తేదీన ఉపాధి హామీ కూలీలకు రెండవ విడతగా ఈ స్వీయ గణన ఉంటుందని సౌకర్యం సద్వినియోగం చేసుకోవాలని కలెక్టర్ ఒక ప్రకటనలో తెలిపారు జిల్లా వ్యాప్తంగా ఈ 15 రోజుల కార్యక్రమం సజావుగా సాగేలా అన్ని శాఖలు సమన్వయం తో పనిచేయాలని సూచించారు. ప్రతి సచివాలయ పరిధిలో రోజుకు కనీసం 10 నుండి 20 మంది వ్యక్తులు స్వీయ గణన చేసుకునేలా సిబ్బంది ప్రోత్సహించాలనీ పేర్కొన్నారు. పత్రికలు, సోషల్ మీడియా మరియు ఇతర మాధ్యమాల ద్వారా ఈ కార్యక్రమానికి విస్తృత ప్రచారం కల్పించాలనీ సూచించారు. శాఖాధిపతులు తమ పరిధిలోని సిబ్బంది అందరూ నిర్ణీత షెడ్యూల్ ప్రకారం స్వీయ గణన పూర్తి చేసేలా చర్యలు తీసుకోవాలనీ కోరారు. ఈ స్వీయ గణన ప్రక్రియ పూర్తిగా స్వచ్ఛందమైనదని ఎవరినీ దీని కోసం నిర్బంధించకూడదని కలెక్టర్ స్పష్టం చేశారు. అయితే, దేశాభివృద్ధిలో కీలకమైన ఈ జాతీయ కార్యక్రమంలో జిల్లా ప్రజలందరూ భాగస్వాములు కావాలని, డిజిటల్ పద్ధతిలో తమ వివరాలను నమోదు చేసుకుని జనగణనను విజయవంతం చేయాలనీ జిల్లా కలెక్టర్ మరియు ప్రిన్సిపల్ సెన్సస్ ఆఫీసర్, అనంతపురం జిల్లా వారు ఆ ప్రకటనలో తెలిపారు

## అడ్డంగా నరుకుతామన్న ఎమ్మెల్యే వ్యాఖ్యలపై శ్రీధర్ బాబు వివరణ

**హైదరాబాద్ :** రామగుండం ఎమ్మెల్యే మక్కన్ సింగ్ రాజ్ ఠాకూర్ చేసిన వ్యాఖ్యలు రాజకీయంగా పెద్ద దుమారం రేపాయి. మంథనిలో జరిగిన ఒక కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ, కాంగ్రెస్ కార్యకర్తలను ఎవరైనా బెదిరిస్తే "అడ్డంగా నరుకుతాం" అంటూ చేసిన వ్యాఖ్యలపై సోషల్ మీడియాలో తీవ్ర విమర్శలు వచ్చాయి. ఈ నేపథ్యంలో, రాష్ట్ర మంత్రి శ్రీధర్ బాబు ఈ వివాదంపై స్పందిస్తూ వివరణ ఇచ్చారు. రాజ్ ఠాకూర్ శాంతిని కోరుకునే వ్యక్తి అని, ప్రస్తుతం కాంగ్రెస్ కార్యకర్తలను చాలా మంది బెదిరిస్తుండటంతో వారికి ధైర్యం చెప్పే క్రమంలోనే ఆయన ఆవేశంగా మాట్లాడారని మంత్రి సమర్థించారు. జిల్లా కాంగ్రెస్ అధ్యక్షుడిగా కార్యకర్తలు తమ బాధలు చెప్పుకున్నప్పుడు వారిలో భరోసా నింపేందుకు అలా స్పందించాల్సి వచ్చిందని తెలిపారు. శాంతికి విఘాతం కలిగించే ఆలోచనలు ఎవరు చేసినా తమ ప్రభుత్వం ఖండిస్తుందని, చట్టాన్ని అతిక్రమించే ఉద్దేశం ఎవరికీ లేదని మంత్రి స్పష్టం చేశారు. అడ్డంగా నరుకుతామన్న ఎమ్మెల్యే వ్యాఖ్యలపై శ్రీధర్ బాబు వివరణమంథనిలో జరిగిన ఒక సమావేశంలో రాజ్ ఠాకూర్ మాట్లాడుతూ.. "మంథనిలో ప్రతిరోజూ శ్రీధర్ బాబు ఉండకపోవచ్చు. కానీ కార్యకర్తలను ఎవరైనా బెదిరిస్తే మేము 2 గంటల్లో ఇక్కడికి వస్తాం. ఎవరైనా అడ్డంగా మాట్లాడితే వారిని అడ్డంగా నరుకుతాం" అని వ్యాఖ్యానించారు. ఒక బాధ్యతాయుతమైన పదవిలో ఉన్న వ్యక్తి ఇలాంటి హింసాత్మక వ్యాఖ్యలు చేయడం సరికాదంటూ విపక్షాలు మండిపడుతున్నాయి.

## నేటి తరానికి స్ఫూర్తి దాయకం అంబేద్కర్ జీవితం

**మొగుళ్ళపల్లి :** మండల కేంద్రంలో అంబేద్కర్ యువజన సంఘం గ్రామ శాఖ ఆధ్వర్యంలో భారత రాజ్యాంగ రచయిత ప్రపంచ మేధావి డాక్టర్ బాబా సాహెబ్ అంబేద్కర్ జయంతి వేడుకలు ఘనంగా జరిగాయి. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా సిఐ మల్లేష్ యాదవ్, ఎస్ఐ ఎం సురేష్ మాట్లాడుతూ దేశ ప్రజల జీవితాల్లో వెలుగు నింపి దేశ చరిత్రను తిరగరాసిన మహోన్నత వ్యక్తి సంఘసంస్కర్త అంటరాని తనం అస్పృశ్యత కుల వివక్ష నిర్మూలన కోసం అలుపెరగని పోరాటం చేసిన మహనీయుడు భారత రాజ్యాంగ రచయిత ప్రపంచ మేధావి డాక్టర్ బాబాసాహెబ్ అంబేద్కర్ అని అన్నారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ చాట్ల విజయ- రవీందర్ చిట్యాల మార్కెట్ వైస్ చైర్మన్ రఫీ, పిఎసిఎస్ చైర్మన్ మాజీ సంపెల్లి నరసింగరావు, కాంగ్రెస్ పార్టీ జిల్లా నాయకులు తక్కలపల్లి రాజు, భారతీయ జనతా పార్టీ భూపాలపల్లి నియోజకవర్గ ఇన్చార్జి మోరే రవీందర్ రెడ్డి, కాంగ్రెస్ పార్టీ మండల ప్రధాన కార్యదర్శి నడిగోటి రాము, దళిత రత్న దబ్బేటి రమేష్, అంబేద్కర్ యువజన సంఘం జిల్లా నాయకులు మంద సాంబయ్య, హర్షం అశోక్, ఎంపీఓ చంద్ర బోస్, పంచాయతీ కార్యదర్శి నరేష్, మాజీ సర్పంచ్ ధర్మారావు, బండారి ప్రవీణ్ కుమార్ ఎంపీడీవో,అంబేద్కర్ యువజన సంఘం జిల్లా నాయకులు బండారి రాజు, బండారి రామస్వామి బండారి విజయ్ కుమార్, బండారి రవీందర్,,మండల నాయకులు మండల అధికారులు అంబేద్కర్ యువజన సంఘం, గుడిమల్ల రమేష్, దొమ్మెటి రవి, హర్ష మహేష్, వార్డు నెంబర్, శనిగరపు శ్రీనివాస్ మాజీ వార్డు నెంబర్, బండారి శంకర్, బండారి కుమార్ ( ధోని) బండారి సదా రాజు, బండారి సదయ్య, బండారి, సామి సార్, శనిగరపు రవికుమార్, బండారి రమేష్,కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు

## ఇల్లంతకుంట ఉప మండల హిందూ సమ్మేళన వాల్ పోస్టర్ ఆవిష్కరణ

**రాజన్న సిరిసిల్ల :** ఇల్లంతకుంట మండల కేంద్రంలోని స్థానిక వాణినికేతన్ హైస్కూల్లో ఆవరణలో ఇల్లంతకుంట ఉప మండల హిందూ సమ్మేళన నిర్వహణ సమితి అధ్యక్షులు తూముకుంట మోహన్ రెడ్డి ఆధ్వర్యంలో హిందూ సమ్మేళన గోడపత్రిక , కరపత్రం ఆవిష్కరణ చేశారు. ఈ సందర్భంగా తూముకుంట మోహన్ రెడ్డి మాట్లాడుతూ అసంఘటితంగా ఉన్న హిందూ సమాజాన్ని ఏకత్రాటిపై సంఘటిత పరచాలని ఉద్దేశంతోనే హిందూ సమ్మేళన బహిరంగ సభను నిర్వహిస్తున్నామని తెలిపారు.

# బిజినెస్

## వచ్చే ఏప్రిల్ నుంచే కేఫ్ 3 నిబంధనలు



కార్పొరేట్ యావరేజ్ ఫ్యూయల్ ఎఫిషియెన్సీ 3(కేఫ్ 3) ప్రమాణాల అమలు గడువును ప్రభుత్వం పొడిగించే అవకాశం లేదని భారీ పరిశ్రమల మంత్రిత్వ శాఖ అదనపు కార్యదర్శి హనీఫ్ ఖురేషి తెలిపారు. వచ్చే ఏడాది ఏప్రిల్ 1 నుంచి వాహన తయారీదారులు కఠిన ఇంధన సామర్థ్య నిబంధనలను పాటించాల్సి ఉంటుందని ఆయన స్పష్టం చేశారు. కేఫ్ 3 నిబంధనలపై ప్రభుత్వం ఆటో పరిశ్రమ భాగస్వాములతో నిరంతరం సంప్రదింపులు జరుపుతోంది, వారికి ఎప్పటికప్పుడు సమాచారం ఇస్తూ, అభిప్రాయాలను క్రమం తప్పకుండా కోరుతున్నామన్నారు. అమలు గడువును 2027, ఏప్రిల్ 1 తర్వాత పొడిగించాల్సిన అవసరం రాకపోవచ్చని ఆయన అన్నారు. కాగా, 'కేఫ్-2027'గా పిలిచే ఈ నిబంధనల ప్రకారం, ప్రతి కారు అన్ని మోడళ్ల సగటు ఫ్యూయెల్ ఎఫిషియెన్సీ, కార్బన్ డయాక్సైడ్ ఎమిషన్ నిర్దిష్ట స్థాయి కంటే తక్కువగా ఉండాలి. మరింత సులభంగా చెప్పాలంటే.. వాహనాలు తక్కువ ఇంధనం, తక్కువ కాలుష్యం వాడాలి. మెరుగైన మైలేజీ ఇవ్వాలి.

## ఉజ్జీవన్ ఎస్ఎఫ్‌బీ దరఖాస్తును వెనక్కి పంపిన ఆర్‌బీఐ




ప్రముఖ ఉజ్జీవన్ స్మాల్ ఫైనాన్స్ బ్యాంక్ (ఎస్ఎఫ్‌బీ) యూనివర్సల్ బ్యాంకుగా మారేందుకు ఇచ్చిన దరఖాస్తును భారతీయ రిజర్వ్ బ్యాంక్ (ఆర్‌బీఐ) వెనక్కి పంపింది. అయితే, ఇది దరఖాస్తును రద్దు చేయడం కాదు, అన్ని రకాల బ్యాంకింగ్ సేవలు అందించే పూర్తి స్థాయి బ్యాంకుగా మారేందుకు అవసరమైన స్థాయిలో సిద్ధంగా లేనందున దరఖాస్తును తిరిగివ్వడం. బ్యాంకు తన లోన్ బుక్‌ను మరింత విస్తరించాల్సిన అవసరం ఉందని ఆర్‌బీఐ పేర్కొంది. లోన్ పోర్ట్‌ఫోలియోను అన్ని విభాగాలకు విస్తరించిన తర్వాత దరఖాస్తును పరిగణలోకి తీసుకుంటామని సూచించింది. ప్రస్తుతం ఉజ్జీవన్ ఎస్ఎఫ్‌బీ ఇచ్చే రుణాలు ఇంకా పూర్తిగా అన్ని విభాగాల్లో లేవు. ఇప్పటికీ ఎక్కువ లోన్స్ ఒకే రకంగా ఉన్నాయి. ముఖ్యంగా అన్‌సెక్యూర్డ్ లోన్స్ వాటా అధికంగా ఉంది. యూనివర్సల్ బ్యాంక్ కావాలంటే, గృహ, వ్యాపార రుణాలు వంటి సెక్యూర్డ్ లోన్లు ఇంకా మెరుగుపడాలి. ప్రస్తుతం బ్యాంకు సెక్యూర్డ్ లోన్లు 43 శాతం నుంచి 49 శాతానికి పెరిగాయి. అన్‌సెక్యూర్డ్ లోన్లు క్రమంగా తగ్గుతున్నాయి. కానీ, సెక్యూర్డ్ లోన్స్ విభాగంలోని హోమ్, గోల్డ్, ప్రాపర్టీ లోన్లు పెంచాల్సి ఉంది. ఈ కారణంగానే ఆర్‌బీఐ మరింత మెరుగుపడిన తర్వాత యూనివర్సల్ బ్యాంకు హోదా కోసం దరఖాస్తు చేయాలని వెల్లడించింది.

# ఇరాన్ యుద్ధం తర్వాత పొంచి ఉన్న ఉద్యోగ సంక్షోభం




ఈ ఏడాది ప్రపంచ ఆర్థిక రంగాన్ని పశ్చిమాసియా యుద్ధం ఎక్కువ ప్రభావితం చేసింది. ఈ నేపథ్యంలో ప్రపంచ బ్యాంకు చీఫ్ అజయ్ బంగా కీలక వ్యాఖ్యలు చేశారు. పశ్చిమాసియా ఉద్రిక్తతల ప్రభావం భవిష్యత్తులోనూ కొనసాగుతుందని ఆయన తెలిపారు. దీర్ఘకాలంలో అంటే వచ్చే పదేళ్లలో కోట్లాది మందిని ఈ యుద్ధం నిరుద్యోగులుగా మార్చగలిగే ప్రమాదం పొంచి ఉందని ఆయన హెచ్చరించారు. రాబోయే 10 నుంచి 15 ఏళ్లలో అభివృద్ధి చెందుతున్న దేశాల్లో సుమారు 120 కోట్ల మంది ప్రజలు పని చేసే వయస్సులోకి ప్రవేశించనున్నారు. ప్రస్తుత ఆర్థిక ధోరణులు కేవలం 40 కోట్ల ఉద్యోగాలను మాత్రమే సృష్టిస్తాయని, దీనివల్ల దాదాపు 80 కోట్ల ఉద్యోగాల కొరత ఏర్పడుతుందని తెలిపారు. ఇరాన్ యుద్ధం, ముడి చమురు ధరల పెరుగుదల వంటి తాత్కాలిక సమస్యలపై ప్రభుత్వాలు దృష్టి పెట్టడం వల్ల, దేశానికి ముఖ్యమైన దీర్ఘకాల ఉద్యోగ సమస్యలు పట్టించుకోకుండా పోతున్నాయని అజయ్ బంగా అభిప్రాయపడ్డారు. ప్రభుత్వాలు తక్షణం ఎదుర్కొంటున్న సంక్షోభాలను, ఉద్యోగ కల్పన, స్వచ్ఛమైన నీటి లభ్యత, విద్యుదీకరణ వంటి దీర్ఘకాలిక ప్రాధాన్యతలతో సమతుల్యం చేసుకోవాలని వరల్డ్ బ్యాంక్ చీఫ్ సూచించారు. ఉద్యోగాలను కల్పించడంలో విఫలమైతే అది అక్రమ వలసలు, అస్థిరతకు ఆజ్యం పోస్తుందని ఆయన స్పష్టం చేశారు. 2025 నాటికి ప్రపంచవ్యాప్తంగా 11.7 కోట్ల మందికి పైగా ప్రజలు నిరాశ్రయులయ్యారని ఐక్యరాజ్యసమితి అంచనాలు చెబుతున్నాయి. తక్షణ సమస్యలైన ద్రవ్యోల్బణం, మార్కెట్ల పతనం, నిధుల కొరతతో పాటు ఉద్యోగాల కొరత, మౌలిక సదుపాయాల కల్పనలో లోపాలు, ఇతర ప్రతికూలతల వంటి దీర్ఘకాల సమస్యలను పరిష్కరించడానికి, ప్రభుత్వం, బ్యాంకులు, ప్రైవేట్ ఇన్వెస్టర్లు కలిసి పని చేయడం చాలా అవసరమని అజయ్ బంగా వెల్లడించారు.

# హర్మ్మజ్ బ్లాకేడ్‌తో భారత్‌పై తీవ్ర ప్రభావం!



హర్మ్మజ్ జలసంధిని అమెరికా సైన్యం దిగ్బంధించడంతో ప్రపంచ వ్యాప్తంగా ఆందోళన నెలకొంది. సౌదీ అరేబియా సహా పలు దేశాలు అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్‌నకు రిక్వెస్ట్‌లు చేస్తున్నాయి. చైనా సహా ఇంకొన్ని దేశాలు ఈ నిర్ణయాన్ని తీవ్రంగా తప్పుబడుతున్నాయి. అదే సమయంలో.. ఈ బ్లాకేడ్ ప్రభావంతో ప్రపంచ ఇంధన మార్కెట్లు కుదేలవుతున్నాయి. ఈ పరిణామం భారత్‌పై కూడా తీవ్ర ప్రభావం చూపే చాన్స్ కనిపిస్తోంది. గ్లోబల్ మార్కెట్‌లో ముడి చమురు ధర ప్రస్తుతం 99 డాలర్ల వద్ద ఉంది. హర్మ్మజ్ బ్లాకేడ్ కొనసాగితే అది 150 డాలర్ల వరకు పెరిగే అవకాశం ఉందని నిపుణులు హెచ్చరిస్తున్నారు. భారత్ గల్ఫ్ దేశాలపై అధికంగా ఆధారపడుతుంది. చమురు ధరలు పెరగడం వల్ల దిగుమతి బిల్లులు పెరగడం, ద్రవ్యోల్బణం పెరగడం, వాణిజ్య లోటు పెరిగే అవకాశం లేకపోలేదు. పైగా జలసంధి ద్వారా రోజుకు 12 మిలియన్ బ్యారెల్ల ముడి చమురు సరఫరా జరుగుతుంది. ఈ మార్గం మూసుకుపోతే భారత్‌తో సహా ప్రపంచవ్యాప్తంగా ఇంధన సంక్షోభం తీవ్ర తరం కావొచ్చు. అలాగే పెరిగిన ఇంధన ధరలు నేరుగా రవాణా, విద్యుత్, ఆహార ధరలపై ప్రభావం చూపెట్టొచ్చు. హర్మ్మజ్ బ్లాకేడ్‌పై భారత్ ఇంకా స్పందించాల్సి ఉంది. భారత నౌకలకు హర్మ్మజ్ జలసంధి మార్గాన్ని ఇరాన్ మూసేసిందని ఒక ప్రచారం నడుస్తోంది. అయితే అది ఉత్తదేనని ఇరాన్ అంటోంది. న్యూఢిల్లీలో ఇరాన్ రాయబారి మొహమ్మద్ ఫతాలి ఎన్‌డీటీవీకి ఇచ్చిన ఇంటర్వ్యూలో మాట్లాడుతూ.. "భారతదేశం మా స్నేహపూర్వక దేశం. హర్మ్మజ్ మార్గం భారత నౌకలకు తెరిచే ఉంటుంది. అమెరికా ఈ బ్లాకేడ్‌తో తప్పు లెక్కలు వేసింది. ఈ చర్య అంతర్జాతీయ చట్టాలను ధ్వంసం చేస్తుందని, ప్రపంచ ఆర్థిక వ్యవస్థను కుదిపేస్తుంది" అని హెచ్చరించారు. మొత్తంగా, హోర్ముజ్ బ్లాకేడ్ భారత్‌కు ఇంధన భద్రతా సంక్షోభం తెచ్చే అవకాశం ఉన్నప్పటికీ.. ఇరాన్ ఇచ్చిన హామీ కొంత ఉపశమనం కలిగిస్తోంది. కానీ ధరల పెరుగుదల, సరఫరా అంతరాయం వంటి సమస్యలు భారత ఆర్థిక వ్యవస్థకు పెద్ద సవాలుగా మారే అవకాశం లేకపోలేదు.

## ఎల్ఐసీ బోనస్ షేర్ల జారీ




1:1 నిష్పత్తిలో బోనస్ షేర్లను జారీ చేసేందుకు లైఫ్ ఇన్సూరెన్స్ కార్పొరేషన్ (ఎల్ఐసీ) బోర్డు ఆమోదం తెలిపింది. 2025 డిసెంబరు 31 నాటికి ఎల్ఐసీ వద్ద ఉన్న రూ.6,325 కోట్ల నిల్వలు, మిగులు నిధులతో ఈ బోనస్ ఇష్యూను పూర్తి చేయనున్నట్లు ఎక్స్ఛేంజీలకు ఇచ్చిన సమాచారంలో ఎల్ఐసీ తెలిపింది. రికార్డు తేదీకి (ఇంకా నిర్ణయించలేదు) రూ.10 ముఖవిలువ కలిగిన ఒక్కో ఈక్విటీ షేరు కలిగిన వాటాదార్లకు అదనంగా రూ.10 ముఖవిలువ కలిగిన మరో ఈక్విటీ షేరును బోనస్‌గా జారీ చేస్తారు. ప్రస్తుతం ఎల్ఐసీలో ప్రభుత్వానికి 96.5 శాతం వాటా ఉంది. 2022 మేలో ఐపీఓ ద్వారా 3.5 శాతం వాటాను విక్రయించి దాదాపు రూ.21,000 కోట్లను ప్రభుత్వం సమీకరించింది. ఈ బోనస్ షేర్ల ఇష్యూ వల్ల భవిష్యత్తులో ఎల్ఐసీలో ప్రభుత్వం మరింత వాటాను విక్రయించడానికి లేదా ఆఫర్ ఫర్ సేల్(ఓఎఫ్ఎస్)కు రావడానికి మార్గం సుగమం అవుతుంది. ఎల్ఐసీ ఓఎఫ్ఎస్‌కు ప్రభుత్వం సన్నాహాలు చేస్తున్నట్లు సంబంధిత వర్గాలు తెలిపాయి.

# సోకులకే ఉన్నాడు తప్ప ఆడింది ఏమీ లేదు



రాజస్తాన్ రాయల్స్ కెప్టెన్ రియాన్ పరాగ్‌పై మాజీ క్రికెటర్ క్రిష్ణమాచారి శ్రీకాంత్ ఆసక్తికర వ్యాఖ్యలు చేశాడు. ఐపీఎల్‌లో సోకులకే ఉన్నాడు తప్ప బ్యాట్‌తో పెద్దగా ఆడింది లేదంటూ ఘాటుగా విమర్శించాడు. కాగా సోమవారం ఎస్ఆర్‌హెచ్‌తో జరిగిన మ్యాచ్‌లో రాజస్తాన్ 57 పరుగుల తేడాతో పరాజయం పాలైన సంగతి తెలిసిందే. అయితే ఈ సీజన్‌లో రాజస్తాన్ రాయల్స్ వరుసగా నాలుగు విజయాలు సాధించినప్పటికీ అందులో రియాన్ పరాగ్ పాత్ర శూన్యం. బ్యాటింగ్‌లో పెద్దగా ఆకట్టుకోలేకపోయాడు. కెప్టెన్‌గా ఉన్నాడు కాబట్టి జట్టులో ఉన్నాడు లేదంటే డగౌట్‌కే పరిమితం కావాల్సి వచ్చేదని విమర్శలు వ్యక్తమయ్యాయి. ఈ నేపథ్యంలో క్రిష్ శ్రీకాంత్ మాట్లాడుతూ... 'రియాన్ పరాగ్ జట్టులో ఫోజు కొట్టడానికే ఉన్నాడు. స్టైల్‌గా బ్యాటింగ్‌కు వచ్చి త్వరగా ఔటయ్యాడు. ప్రెజెంటేషన్ వేడుకలో మాట్లాడి వెళ్లిపోయాడు. అంతా ఫోజు కొట్టడం తప్పా మరేమీ చేయలేదు. జడేజా వంటి సీనియర్ బౌలర్‌కు బౌలింగ్ ఇవ్వలేదు. ఎందుకని అడిగితే.. రవి బిష్ణోయ్‌నే సన్‌రైజర్స్ బ్యాటర్లు చితక్కొట్టారని, లెఫ్టార్మ్ బ్యాటర్ అయిన ఇషాన్ కిషన్ మెరుగ్గా ఆడుతుండటంతో బౌలింగ్ ఇవ్వలేదని చెప్పాడు. లెఫ్టార్మ్ స్పిన్నర్.. లెఫ్టార్మ్ బ్యాటర్‌కు బౌలింగ్ చేయకూడదనే రూల్ ఏమైనా ఉందా? ఇది అసంబద్ధం. ఎస్ఆర్‌హెచ్ అద్భుత ప్రదర్శన కనబర్చింది. ముఖ్యంగా ప్రఫుల్ హింగే తొలి ఓవర్‌లోనే మ్యాచ్‌ను ముగించాడు. ఇషాన్ కిషన్ కెప్టెన్సీ కూడా చాలా బాగుంది. వారికి నలుగురు యువ బౌలర్లున్నారు. వారితోనే రాజస్థాన్ రాయల్స్‌ను ఆలౌట్ చేశారు. అద్భుతం.'అని కొనియాడాడు.


# వరల్డ్‌కప్ హీరో శాంసన్‌కు ఐసీసీ అవార్డు.. బుమ్రాకు నిరాశ..!




పొట్టి వరల్డ్‌కప్‌లో పిడుగుల్లే విరుచుకపడిన సంజూ శాంసన్ (ఝఅయబ ఝఎంశీఅ)కు తగిన గుర్తింపు దక్కింది. సంచలన ఇన్నింగ్స్‌లతో భారత్ మూడోసారి టీ20 ప్రపంచకప్ గెలవడంలో కీలకమైన సంజూకు ఐసీసీ అవార్డు లభించింది. స్వదేశంలో జరిగిన టోర్నీలో హ్యాట్రిక్ అర్ధ శతకాలతో భారత్‌ను విజేతగా నిలిపిన సంజూ 'ప్లేయర్ ఆఫ్ ది మంత్' అవార్డుకు ఎంపికయ్యాడు. మార్చి నెలకు ఐసీసీ జరిపిన ఓటింగ్‌లో టీమిండియా పేసర్ జస్ప్రీత్ బుమ్రాను వెనక్కి నెట్టేసి శాంసన్ ఈ గౌరవాన్ని అందుకున్నాడు. మహిళల విభాగంలో అమేలియా కేర్ అవార్డును ఎగరేసుకుపోయింది. భారత్, శ్రీలంక వేదికగా జరిగిన పొట్టి ప్రపంచకప్‌లో చిరస్మరణీయ ఆట ఆడిన సంజూ శాంసన్‌ను ఐసీసీ అవార్డు వరించింది. క్వార్టర్ ఫైనల్ లాంటి మ్యాచ్‌లో వెస్టిండీస్‌పై 97.. ఆపై ఇంగ్లండ్ మీద 89, ఫైనల్లో న్యూజిలాండ్‌పై అర్ధ శతకంతో రెచ్చిపోయిన సంజూ.. ఐసీసీ ప్లేయర్ ఆఫ్ ది మంత్ అవార్డు గెలుపొందాడు. తనకు ఈ ప్రతిష్ఠాత్మక అవార్డు రావడం పట్ల శాంసన్ సంతోషం వ్యక్తం చేశాడు. 'ఐసీసీ అవార్డుకు ఎంపికవ్వడం ఎంతో గొప్ప అనుభూతి. నా క్రికెట్ ప్రయాణంలో మర్చిపోలేని దశ సమయంలో ఈ అవార్డు రావడం చాలా సంతోషంగా ఉంది. భారత జట్టు టీ20 పప్రంచకప్ విజయంలో భాగమవ్వడం ద్వారా నా కల నిజమైంది. ఐసీసీ అవార్డు విజయాన్ని ఆస్వాదిస్తున్నా. ప్రతిభావంతులతో కూడిన భారత క్రికెట్‌లో ఇది చాలా ముఖ్యమైన దశ. నాకు అవకాశాలు దక్కినందుకు చాలా ఆనందంగా ఉంది. నాపై నమ్మకం ఉంచినందుకు జట్టు సభ్యులు, కోచింగ్ సిబ్బందికి కృతజ్ఞతలు' అని శాంసన్ వెల్లడించాడు. వరల్డ్‌కప్ హీరోగా ఐపీఎల్‌లో అడుగుపెట్టిన శాంసన్ మూడు మ్యాచుల్లో విఫలమైనా.. నాలుగో మ్యాచ్‌లో సెంచరీతో గర్జించాడు.

# స్పోర్ట్స్

## ఆరెంజ్ ఆర్మీకి గుడ్‌న్యూస్.. కమిన్స్ వచ్చేస్తున్నాడు!




పంతొమ్మిదో సీజన్‌లో రెండో విజయంలో ప్లే ఆఫ్స్ రేసులోకి దూసుకొచ్చింది సన్‌రైజర్స్ హైదరాబాద్ బ్యాటర్లే కాదు మేమూ జట్టును గెలిపించగలమని అరంగేట్రం మ్యాచ్‌లోనే కుర్రాళ్లు నిరూపించడంతో జోరు మీదున్న ఆరెంజ్ ఆర్మీకి మరో గుడ్‌న్యూస్. మాజీ కెప్టెన్, వెటరన్ పేసర్ ప్యాట్ కమిన్స్ త్వరలోనే స్క్వాడ్‌తో కలువనున్నాడు. ఫిట్‌నెస్ పరీక్షల అనంతరం నేరుగా భారత్‌కు వచ్చేయనున్నాడు ప్యాటీ. ఐపీఎల్ కోసం మార్చి 27న భారత్‌కు వచ్చేసిన కమిన్స్ అనుకోకుండా టోర్నీ మధ్యలోనే స్వదేశం వెళ్లాడు. ప్రస్తుతం ఆస్ట్రేలియాలోనే ఉన్న ప్యాటీ.. బుధవారం ఫిట్‌నెస్ పరీక్షలకు హాజరు కానున్నాడు. ఒకవేళ ఫిట్‌నెస్ టెస్టులో గట్టెక్కితే అతడు మళ్లీ స్క్వాడ్‌లో చేరతాడాని సన్‌రైజర్స్ యాజమాన్యం ఆశలు పెట్టుకుంది. అన్నీ అనుకున్నట్టు జరిగితే ఏప్రిల్ 17వ తేదీన కమిన్స్ హైదరాబాద్‌కు వస్తాడని క్రిక్‌బజ్ కథనం పేర్కొంది. మరుసటి రోజు ఉప్పల్ స్టేడియంలో చెన్నై సూపర్ కింగ్స్‌తో మ్యాచ్‌కు ఈ వెటరన్ పేసర్ అందుబాటులో ఉండే అవకాశముంది. కుర్రాళ్లు ప్రఫుల్ హింగే, షకీబ్ హుస్సేన్‌లకు తోడు కమిన్స్ మైదానంలోకి దిగాడంటే ప్రత్యర్థులకు ఇక హడలే. అయితే.. ఐపీఎల్‌కు అనుమతిస్తే.. పని ఒత్తిడి కారణంగా ఫాస్ట్ బౌలర్లు గాయడపడతారనే భయంతో నో అబ్జెక్షన్ సర్టిఫికెట్ ఇవ్వడానికి క్రికెట్ ఆస్ట్రేలియా తెగ ఆలోచిస్తుంది. ఢిల్లీ క్యాపిటల్స్‌కు ఆడాల్సిన ప్రధాన పేసర్ మిచెల్ స్టార్క్‌కు ఇంకా ఎన్‌వోసీ ఇవ్వలేదు. యువ ఆల్‌రౌండర్ కామెరూన్ గ్రీన్‌కు అనుమతిచ్చినా.. బౌలింగ్‌పై ఆంక్షలు విధించింది. ఆర్సీబీ శిబిరంలో హేజిల్‌వుడ్ ఆలస్యంగా చేరడానికి కారణం.. ఎన్‌వోసీ జాప్యమే.



# మండుటెండలో చెప్పుల్లేకుండా షూటింగ్.. 'తెరచాప' హిట్ కావాలి

నవీన్ రాజ్ శంకరపు, పూజ సుహాసిని, శ్రీలు ముఖ్యపాత్రలో నటించిన తాజా చిత్రం 'తెరచాప'. అనన్య క్రియేషన్స్ బ్యానర్ పై కైలాష్ దుర్గం నిర్మిస్తున్న ఈ చిత్రానికి జోయల్ జార్జ్ దర్శకత్వం వహిస్తున్నాడు. రాజీవ్ కనకాల, పృథ్వీరాజ్, జగదీష్ ప్రతాప్ బండారి, జబర్దస్త్ అశోక్, నాగి కీలకపాత్రలు పోషించారు. ఏప్రిల్ 17న ఈ చిత్రం విడుదల కాబోతుంది. ఈ నేపథ్యంగా తాజాగా ఈ మూవీ ప్రీరిలీజ్ ఈవెంట్‌ని నిర్వహించారు. ఈ సందర్భంగా రాజీ కనకాల మాట్లాడుతూ..ఈ సినిమాలో నాతోపాటు ఎందరో సీనియర్ నటులు నటించారు. అలాగే కొత్త వారు కూడా నటించారు. మండుటెండలో సముద్ర తీరాన ఇసుకలో చెప్పులు లేకుండా నటించడం అనేది ఎంతో కష్టమైన పరిస్థితి. అటువంటి పరిస్థితులలో కూడా నవీన్ రాజ్ చాలా కష్టపడి నటించారు. శారీరకంగానే కాకుండా మానసిక ఒత్తిళ్లు ఎన్ని ఉన్నా కూడా ఆయన వాటిని ఎదిరించి నిలబడ్డారు. అంత కష్టపడి నటించినా ఈ సినిమాను తన తండ్రికి అంకితం చేస్తున్నాను అని నాతో అన్నప్పుడు నేను ఎంతో ఆనందపడ్డాను.ఈ సినిమా ఘన విజయం సాధించాలని కోరుకుంటున్నాను' అన్నారు. దర్శకుడు సముద్ర మాట్లాడుతూ... "సముద్రతీతంగా అటువంటి పరిస్థితులలో ఒక సినిమా తీయడం అనేది ఎంతో కష్టమైన విషయం. అటువంటి సినిమాను ఈ చిత్రం బృందం అంతా కలిసి ఎంతో పట్టుదలతో పూర్తి చేసి ప్రేక్షకుల ముందుకు రాబోతున్నారు. అందరూ వీరిని ఆశీర్వదించవలసిందిగా కోరుకుంటున్నాను" అన్నారు. 'సినిమా కోసం మేము సముద్ర తీరాన ఎన్నో రోజులు ఎంతో కష్టపడి అక్కడ బ్రతికే మత్స్యకారుల జీవితాలను అర్థం చేసుకొని వారిలో ఒకరిగా కలిసిపోయి చిత్రీకరించాం. ఎంతోమంది ఎన్నో కలలు కని సినిమా తీసినట్లే మేము కూడా చేశాం. మా సినిమాను ప్రేక్షకులు అంతా ఆదరించి మంచి విజయం సాధించేందుకు తోడ్పడుతారని కోరుకుంటున్నాను' అని హీరో నవీన్‌రాజ్ శంకరాపు అన్నారు.

# రాకా.. ఆ నలుగురితో కేక

పుష్ప సినిమాతో అల్లు అర్జున్ పాన్ ఇండియా స్టార్ అయ్యాడు. ఇప్పుడు ఆయన?కు తెలుగులోనే కాదు దేశ వ్యాప్తంగా అభిమానులు ఉన్నారు. వారందరిని మెప్పించే కథలపైనే బన్నీ ఫోకస్ పెట్టాడు. అందులో ఒకటి రాకా. అల్లు అర్జున్ – – అట్లీ కాంబోలో రూపుదిద్దుకొంటున్న తొలి సినిమా ఇది. రూ. 900 కోట్ల భారీ బడ్జెట్‌తో పాన్ ఇండియా స్థాయిలో ఈ సినిమాను తెరకెక్కిస్తున్నారు. షూటింగ్ మొదలైనప్పటి నుంచే ఈ సినిమాపై భారీ అంచనాలు ఏర్పడ్డాయి. ఇక బన్నీ బర్త్‌డే సందర్భంగా విడుదలైన ఫస్ట్ లుక్, టైటిల్ రివీల్ ఆ అంచనాలను మరింత పెంచేశాయి. ఇందులో బన్నీ హీరోగా, విలన్‌గా ద్విపాత్రాభినయం చేస్తున్నాడు. ఇప్పుడు బయటకు వచ్చిన లుక్ విలన్‌ది. హీరో పాత్రకు సంబంధించిన లుక్ చాలా స్టైలీష్‌గా ఉంటుందట. ఇదిలా ఉంటే.. ఇప్పుడు ఈ చిత్రానికి సంబంధించిన మరో ఆసక్తికరమైన విషయం బయటకు వచ్చింది. ఈ సినిమాలు మొత్తం నలుగురు హీరోయిన్లు ఉంటారు. ఇప్పటికే ఒక హీరోయిన్‌గా దీపికా పదుకొణె పేరు బయటకు వచ్చింది. మరో ముగ్గురు హీరోయిన్లలో రష్మిక, మృణాల్, జాన్వీ కపూర్ పేర్లు బలంగా వినిపిస్తున్నాయి. వీరిలో రష్మిక అల్రేడీ బన్నీతో కలిసి పుష్ప, పుష్ప 2 చిత్రాల్లో నటించింది. మృణాల్, జాన్వీలు తొలిసారి బన్నీతో స్క్రీన్ చేసుకుంటున్నారు. ఇలా ఒకే సినిమాలో నలుగురు హీరోయిన్లతో కలిసి నటించడం బన్నీ కెరీర్‌లోనే తొలిసారి. కథ డిమాండ్ మేరకే నలుగురిని తీసుకున్నారట. అంతేకాదు ఈ నలుగురి పాత్రలు కూడా సినిమాలో కీలకం అట. ఒకవైపు కావాల్సినంత గ్లామర్‌ని చూపిస్తూనే.. మరోవైపు కథలో కీలకంగా వ్యవహరించేలా వీరి పాత్రలను తీర్చిదిద్దినట్లు సమాచారం. ఈ నలుగురూ బన్నీతో ఒకే ఫ్రేమ్ లో కనిపిస్తే మాత్రం ఫ్యాన్స్ పండగ చేసుకోవడం ఖాయం.




# అనుకున్న తేదీకే 'టాక్సిక్'.. పుకార్లను నమ్మవద్దన్న మేకర్స్



కన్నడ స్టార్ నటుడు యశ్ కథానాయకుడిగా గీతూ మోహన్ దాస్ దర్శకత్వంలో రూపొందుతున్న భారీ బడ్జెట్ చిత్రం 'టాక్సిక్'. ఈ సినిమా విడుదల వాయిదా పడిందంటూ గత కొన్ని రోజులుగా సోషల్ మీడియాలో జోరుగా ప్రచారం సాగుతోంది. అయితే ఈ వార్తలపై చిత్ర బృందం తాజాగా స్పందిస్తూ క్లారిటీనిచ్చింది. ఈ సినిమాను అనుకున్న తేదీ ప్రకారమే జూన్ 4 వరల్డ్ వైడ్‌గా విడుదల చేయబోతున్నట్లు చిత్రబృందం తెలిపింది. తొలుత ఈ చిత్రాన్ని 2025 ఏప్రిల్‌లో విడుదల చేయాలని భావించినప్పటికీ ఇరాన్ – ఆమెరికా వార్ నేపథ్యంలో వాయిదా వేసుకుంది. ప్రస్తుతం యశ్ ఈ సినిమా ప్రమోషన్ల కోసం అమెరికాలోని లాస్ వెగాస్‌లో జరుగుతున్న ప్రతిష్టాత్మక 'సినీమాకాన్' వేడుకలో పాల్గొంటున్నారు. దీనిని కేవలం పాన్–ఇండియా స్థాయిలోనే కాకుండా గ్లోబల్ మార్కెట్‌లోనూ భారీగా విడుదల చేసేందుకు టీమ్ ప్లాన్ చేస్తోంది. 1940 నుండి 1970 మధ్య కాలంలో గోవా గ్యాంగ్‌స్టర్ నేపథ్యంలో సాగే ఈ యాక్షన్ డ్రామాలో నయనతార, కియారా అద్వానీ, హ్యూమా ఖురేషీ వంటి అగ్ర తారలు నటిస్తున్నారు.

# 'డ్రాగన్' కోసం ఆలియా?.. ప్రశాంత్ నీల్ సినిమాలో బాలీవుడ్ బ్యూటీ!



జూనియర్ ఎన్టీఆర్, దర్శకుడు ప్రశాంత్ నీల్ కాంబినేషన్‌లో రాబోతున్న సినిమాపై భారీ అంచనాలు నెలకొన్న విషయం తెలిసిందే. ప్రస్తుతానికి 'డ్రాగన్' అనే వర్కింగ్ టైటిల్‌తో రాబోతున్న ఈ సినిమాలో బాలీవుడ్ స్టార్ హీరోయిన్ ఆలియా భట్ ఒక శక్తివంతమైన కీలక పాత్రలో నటించబోతున్నట్లు సమాచారం. గతంలో రాజమౌళి తెరకెక్కించిన '===' చిత్రంలో తారక్, ఆలియా కలిసి నటించి మెప్పించగా, మరోసారి ఈ జంట వెండితెరపై కనిపించబోతుండటం అభిమానుల్లో ఉత్సాహాన్ని నింపుతోంది. ఈ సినిమాలో ఆలియా భట్ కేవలం గ్లామర్ పాత్రకే పరిమితం కాకుండా, కథను మలుపు తిప్పే ప్రాధాన్యత ఉన్న పాత్రలో కనిపిస్తారని సమాచారం. ఇప్పటికే కన్నడ నటి రుక్మిణి వసంత్ ఈ చిత్రంలో కథానాయికగా ఎంపికైనట్లు ప్రచారం జరుగుతుండగా, ఆలియా కూడా చేరితే సినిమాలో ఇద్దరు హీరోయిన్లు ఉండే అవకాశం ఉంది. దర్శకుడు ప్రశాంత్ నీల్ ఇప్పటికే ఆలియాను సంప్రదించారని, దానికి ఆమె సానుకూలంగా స్పందించారని టాక్ నడుస్తోంది, అయితే దీనిపై చిత్ర యూనిట్ నుంచి అధికారిక ప్రకటన రావాల్సి ఉంది. ప్రస్తుతం శరవేగంగా షూటింగ్ జరుపుకుంటున్న ఈ సినిమా కోసం ఎన్టీఆర్ ప్రత్యేకంగా 'కలరిపయట్టు' వంటి మార్షల్ ఆర్ట్స్‌లో శిక్షణ పొందుతున్నారు. ప్రశాంత్ నీల్ మార్క్ హై–వోల్టేజ్ యాక్షన్‌కు ఆలియా వంటి టాలెంటెడ్ నటి తోడైతే, ఈ పాన్–ఇండియా చిత్రం బాక్సాఫీస్ వద్ద సరికొత్త రికార్డులు సృష్టించడం ఖాయమని విశ్లేషకులు భావిస్తున్నారు.

# 'డెకాయిట్' మూవీపై రామ్ చరణ్ ప్రశంసల జల్లు.. అడివి శేష్ నటన అద్భుతమంటూ ట్వీట్!




అడివి శేష్, మృణాల్ ఠాకూర్ ప్రధాన పాత్రల్లో నటించిన మోస్ట్ అవేటెడ్ మూవీ 'డెకాయిట్' పై మెగా పవర్ స్టార్ రామ్ చరణ్ ప్రశంసల జల్లు కురిపించారు. తాజాగా ఈ సినిమాను వీక్షించిన ఆయన, సోషల్ మీడియా వేదికగా తన రివ్యూను పంచుకుంటూ చిత్ర బృందాన్ని అభినందించారు. హరి పాత్రలో అడివి శేష్ అద్భుతమైన నటనను కనబరిచారని, ఆయన పెర్ఫార్మెన్స్ ప్రేక్షకుల మదిలో చిరస్థాయిగా నిలిచిపోతుందని చరణ్ కొనియాడారు. అలాగే మృణాల్ ఠాకూర్ తన నటనతో పాత్రకు ప్రాణం పోశారని, ఈ సినిమాలో ఆమె నటన ఎంతో లోతుగా ఉందంటూ మెచ్చుకున్నారు. బాలీవుడ్ దిగ్గజ దర్శకుడు అనురాగ్ కశ్యప్‌తో పాటు ఇతర నటీనటులందరూ తమ ప్రదర్శనతో సినిమాను మరో స్థాయికి తీసుకెళ్లారని ఆయన పేర్కొన్నారు. ముఖ్యంగా అన్నపూర్ణ స్టూడియోస్ బ్యానర్‌పై సుప్రియ యార్లగడ్డ ఈ చిత్రాన్ని అత్యున్నత సాంకేతిక ప్రమాణాలతో, రాజీ పడకుండా నిర్మించిన తీరును చరణ్ ప్రత్యేకంగా అభినందించారు. సాంకేతికంగా సినిమా ఎంతో రిచ్‌గా ఉందని, టీమ్ మొత్తం పడ్డ కష్టానికి తగిన ఫలితం దక్కిందని ఆయన తెలిపారు. రామ్ చరణ్ స్వయంగా సినిమాను మెచ్చుకుంటూ పోస్ట్ చేయడంతో 'డెకాయిట్' పై ప్రేక్షకుల్లో అంచనాలు రెట్టింపయ్యాయి. వరుస విజయాలతో దూసుకుపోతున్న అడివి శేష్ ఖాతాలో ఈ చిత్రం మరో భారీ విజయంగా నిలుస్తుందని ఇండస్ట్రీ వర్గాలు భావిస్తున్నాయి. ప్రస్తుతం ఈ మెగా ప్రశంసలు సోషల్ మీడియాలో హాట్ టాపిక్‌గా మారాయి.

Publisher, printer and Owner P. Ramanjaneya Prasad, Government Hospital back SIDE Singanamala (Mandal) Ananthapuram (District)- AP, Printing at LAKSHMI OFFSET Printers, D.NO: 12-3-195, 5th cross SAINAGAR Beside Veterinary Hospital Ananthapuram,
Published at P. Ramanjaneya Prasad Government Hospital Back Side Singanamala (Mandal) Ananthapuram (District)- RNI Reg NO: APTEL/2024/86898 ,AP, Editor P.Ramanjaneya Prasad ph:9494900294